ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 17, 2011

ENTERED

జీవన 'యానాం'

హ్యాపీ బర్త్‌డే

(2011 ఏప్రిల్ 17 నుంచి 2011 ఏప్రిల్ 23 వరకు)

డి.వి.ఆర్.సిద్ధార్థ
4సం॥,ఏప్రిల్-19
శాంతిశ్రీ-రాజశేఖర్
క్లీవ్‌లాండ్-అమెరికా

ఎన్. హంసవాహిని
1సం॥, ఏప్రిల్-19
రమ్యశ్రీ-రవీందర్
వెల్మజాల-నల్లగొండ

అరుణ్‌తేజ్
3సం॥, ఏప్రిల్-18
ప్రసన్న-వెంకటేశ్వర్లు
రౌతులపూడి-తూ॥గో

అన్‌ఫియా ఇష్తెహాజ్
8సం॥,ఏప్రిల్-23
నసీమాబేగం-అబ్దుల్‌హకీం
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి



టి. కాస్ట్రో
ఏప్రిల్ 18
ఎస్తేరా-రాంచందర్
జీడికల్- వరంగల్

పి.రమ్యశ్రీ
3సం॥,ఏప్రిల్-20
సునీత-శ్రీనివాసులు
పెనుకొండ-అనంతపురం

మనూష
ఏప్రిల్-19
నాగేంద్రమ్మ-బాల్‌రాజ్
గచ్చిబౌలి-హైదరాబాద్

నిఖిల్
ఏప్రిల్-23
సావిత్రి-రాంభూపాల్
అనంతపురం

పవన్‌సాయి
ఏప్రిల్-17
మహాలక్ష్మి-ప్రతాప్‌కుమార్
భద్రాచలం-ఖమ్మం

పి. దీక్షిత
ఏప్రిల్
ప్రశాంతి-శ్రీనివాస్
గణేష్‌నగర్-ఉప్పల్



హేమంత్ సాయి
పేర్రాజు
ఏప్రిల్-22
వెంకటలక్ష్మి-వీరేష్‌కుమార్
పెనుగొండ-ప॥గో

మనలో మాట

ధగ ధగ... భగ భగ...



'ఆ ధగధగలు చూసి ఎవరైనా మనసు పారేసుకుంటారు. మైమరచిపోతారు. ఆ మైమరపులో చప్పన తాకితే మాత్రం భగ భగ మండుతుంది. చెయ్యి కాలుతుంది. బర్నాల్ రాసుకున్నా ప్రయోజనం ఉండదు. ఇంతకీ ఆ ధగధగలు ఎవరివి? ఆ చెయ్యి ఎవరిది?' అని ఇవాళా రేపూ ఏదైనా రియాల్టీ షోలో అడిగినా అడగొచ్చు. ఆలోచించుకునే అవకాశం ఇవ్వరు యాంకర్లు. లొడలొడా మాట్లాడేస్తుంటారు. స్విచ్ వేస్తే బల్బు వెలిగినంత వేగంగా చెప్పాలి! లేకపోతే పాయింట్లు పక్కవారికి వెళ్లిపోతాయి. ఇంతకీ ఆ ధగధగలు ఎవరివి? వెండీబంగారాలవండీ బాబూ. ఆ చెయ్యి ఎవరిదో ప్రత్యేకంగా చెప్పాలా?! మనదే!

బంగారం అన్న మాట వినబడితే చాలు! కళ్లల్లో మెరుపుల్ తళుకుల్. కొనబోతే మాత్రం కరెంటు షాక్ కొట్టినట్టవుతుంది. పది గ్రాముల పుత్తడి ధర దగ్గర దగ్గరగా 22 వేల రూపాయలు, కేజీ వెండి 62 వేల రూపాయలు. పప్పూ, బియ్యం ధరలూ ఆకాశాన్నంటాయి. బంగారం రేటూ చుక్కలనంటుతోంది. అన్నీ కలిసి పాల్గొంటున్న ఈ రన్నింగ్ రేసులో గెలుపెవరిదైనా! ఓటమి మాత్రం సామాన్యులదే. 'కలి కాలం' కాదు కానీ 'కాలే కాలం' అని సరిదిద్దుకోవాలిమరి!

ఇంత ఖరీదైన బంగారానికి భద్రత ఎక్కడుంది? పట్టపగలే ప్రాణాలు తీసి మరీ నగలు దోచుకుంటున్నారు. తాళం వేసిన ఇంటిని తిరిగి తెరచి చూసుకునే దాకా గుండె దడే. ఒకవేళ దొంగ దొరికినా పోయినదంతా వస్తుందన్న గ్యారెంటీ లేదు. ఎవరి వాటాలు వారికుంటాయిమరి.

బంగారం భయపెడుతోందని ముంగిట్లోకొచ్చిన పెళ్లిళ్ల సీజన్ వెనుదిరగదు. పెళ్లిచూపులూ ఆగిపోవు. పిల్ల బంగారంలా వుందంటారు. నగదుతోపాటు నగానట్రా అలంకరించి పంపమంటారు. వెనకాముందూ చూసుకోకుండా తలూపామా స్థాయినిబట్టి సమర్పించుకోవాల్సిందే.

మన ఇంటి బంగారానికి బజారు బంగారంతో ముడిపెట్టే ముదనష్టం ఎప్పటికి ముగుస్తుందో!

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	5
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
తెలుసుకుందామా	...	10
కొత్త పుస్తకాలు	...	11
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

నలభై వసంతాల
కులనిర్మూలన సంఘం... 4

సినిమా కబుర్లు ... 8
అభినయ ప్రధాన పాత్రలకు
అందమైన చిరునామా

ఈ పేజ్ ... 21
కంప్యూటర్లు...
కరెంటు ఆదా



అలరించిన ఉగాది

తెలుగు సంవత్సరాది కానుకగా అందించిన 'సంప్రదాయాల సంవత్సరాది' అనేక విశేషాలతో అలరించింది. 'రైతువాణి' కథ ద్వారా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మిగిలిన వనరులను కూడా ఉపయోగించుకుంటే జీవితం సాఫీగా సాగిపోతుందని చెప్పే విధానం బాగుంది. సంప్రదాయక 'రుచుల'ను అందిస్తున్నందుకు అభినందనలు. 'వికాసం' లో డా॥ శర్మ గారు 'మీరు... మీ ఆవేశాలు...' ద్వారా మనిషిలోని శారీరక, మానసిక స్పందనలపై అవగాహన కలిగించారు. 'బాలనేస్తాలు' లో చిన్నారులకు ఉపయోగపడేలా ఇస్తున్న పదాల అమరిక, రంగులేద్దామా బాగున్నాయి. 'మాటల కోట' ద్వారా కొత్త పదాలు తెలుసుకోగలుగుతున్నాం. 'ఆట కాదు ఆర్ట్' లో చక్కటి కళాకృతులు చూశాం. 'అంతా మౌస్ మాయ' వల్ల నెట్ విజ్ఞాన విషయాలు తెలిశాయి.

పిడపర్తి విజయలక్ష్మి,
రామారావు పేట, కాకినాడ.

అదే సత్యం

కవర్ స్టోరీ 'సంప్రదాయాల సంవత్సరాది' బాగుంది. దేశ విదేశాల్లో ఎక్కడున్నా తెలుగువాళ్లు ఈ పండుగని తప్పనిసరిగా చేసుకుంటారు. కానీ పంచాంగం ప్రకారం మన జీవితాలు నడవవు. రాశిఫలాలనేది నమ్మకం మాత్రమే. మనిషి జీవితం ప్రకృతిమీద, ప్రస్తుతం నడుస్తున్న రాజకీయాల మీద ఆధారపడి ఉంటుంది. చిత్ర దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి ఇంటర్వ్యూ బాగుంది. ఆయన చెప్పింది నిజమే! జనం గురించి మాట్లాడి, వారి గురించి ఉద్యమించి ప్రజల పక్షాన నిలబడినవారే నిజమైన కమ్యూనిస్టులు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

ప్రకృతి పాఠాలు

డా॥ విజయ్ అందించిన సూపర్ మూన్ విశేషాలు బాగున్నాయి. వారం పదిరోజుల పాటు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేసిన సూపర్‌మూన్ ఎటువంటి అలజడీ లేకుండా ఉదయించింది... అస్తమించింది. ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలూ జరగలేదు. గ్రహచలనమనేది కొత్తకాదు. ఇలాంటివి ఎన్ని వచ్చినా, జోతిష్యులు ఇలాంటి వాటిని ఎన్ని సృష్టించినా ప్రకృతి ముందు ఓడిపోవాల్సిందే.

టి.ఎస్, వైజాగ్.

ప్రాభవం తగ్గిన ప్రయోగాలు

రెంటాల జూనియర్ అందించిన వ్యాసం తెలుగు నిర్మాతల దాతృత్వాన్ని బహిరంగ పరిచేదిగా ఉంది. రాం గోపాల్ వర్మ నిర్మించిన 'దొంగల ముఠా' నిర్మాణం తెలుగు చిత్ర పరిశ్రమపై అంతగా ప్రభావం చూపలేకపోయింది. కానీ గతంలో కె.వి.రెడ్డి చేసిన ప్రయోగాలు, నిబద్ధతని అర్థం చేసుకోవాలి. నేటి నటీనటులు రెమ్యునరేషన్‌ని విపరీతంగా పెంచేశారు. దర్శక నిర్మాతలు, నటీనటులు ఈ పరిస్థితిని అధిగమించినప్పుడే పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.

ఎం.మహాలక్ష్మి, హైదరాబాద్.

నిలువుటద్దం

హైటెక్ తాయిలాలకు మొగ్గు చూపితే తమ అమూల్యమైన ఓటును దుర్వినియోగపరిచినట్లే. తర్వాత నాయకులు తమ గోడు పట్టించుకోవట్లేదు అని ఎంత మొత్తుకున్నా ఉపయోగం ఉండదు. 'వ్యామోహం' కథ నేటి కార్పొరేటీకరణకు నిలువుటద్దంలా అనిపించింది.

బి.విజయ్, గుంటూరు.

నమ్మలేని నిజం

సినిమా కబుర్లలో వచ్చిన

ఇంటర్వ్యూ బాగుంది. నేటి కాలంలో కమర్షియల్ సినిమాలే కాదు ఇలా మన చుట్టూ ఉన్న సమస్యల్ని తెరకెక్కించే దర్శకులు కూడా ఉన్నారని గంగపుత్రులు వంటి సినిమా చూసినప్పుడు అనిపిస్తుంది. 'తెల్సా'లో చేతులు వచ్చేనే అంశం బాగుంది. ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతుంటాయేమో. ఇది నమ్మశక్యం కాని నిజం.

పి.సాంబశివరావు, అనకాపల్లి.

సైన్స్ విజయం

ఉగాది ప్రాశస్త్యాన్ని అట్టమీది కథ తెలియజేసింది. 'రైతువాణి' కథ బాగుంది. 'వికాసం' ద్వారా పరిస్థితులు, పరిసరాలకనుగుణంగా శారీరక, మానసిక ఆరోగ్యం మారతుందని తెలిసింది. 'బాల నేస్తాలు'లో విహంగం శీర్షిక బాగుంది. చివరిపేజీ రంగుల్లో ఆకర్షణీయంగా ఉంది. చేతులు పోయిన మనిషికి తిరిగి చేతులు రావడం అనేది సైన్స్ సాధించిన అద్భుతాల్లో ఓ భాగం. 'సొంతవూరు, గంగపుత్రులు' వంటి చిత్రాలను చూసేవారు కొద్దిమందే కావచ్చు, అయినా అటువంటి ప్రేక్షకుల కోసం చిత్రాలను తీస్తున్న దర్శకులు సునీల్ కుమార్‌రెడ్డి అభినందనీయులు. 'మనలో మాట' అనేక వాస్తవాలను ప్రస్తుతిస్తోంది. పాఠకులు పాల్గొనేలా 'మాటల కోట'కు నజరానాలను ప్రకటిస్తే బావుంటుంది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-9789099589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

నలభై వసంతాల కుల నిర్మూలన సంఘం

మన రాష్ట్రంలో కులాంతర వివాహాలు కొత్త కాదు. అలాగని ఎలాంటి ఇబ్బంది లేకుండా అవి జరగడం లేదు. ఈ రంగంలో కృషి చేస్తున్న సంస్థ ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం. ఇది 1972లో ఏర్పడింది. నాటి నుండి నేటి వరకు సుమారు వెయ్యికి పైగా కులాంతర, మతాంతర వివాహాలను నిర్వహించింది. సమాజం నుండి తీవ్రమైన సవాళ్ళనే ఎదుర్కొంది. అనేక అనుభవాలను గడించింది. ప్రస్తుతం కులనిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా టి.వి.దేవదత్ బాధ్యతలు నిర్వహిస్తుండగా, కార్యదర్శిగా మహమ్మద్ వహీద్ ఉన్నారు. దేవదత్ సంఘం స్థాపించిన నాటి నుండి నేటి వరకు అనేక కీలక బాధ్యతలను నిర్వహించారు. ఆయన అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో ఆడిటర్‌గానూ, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ లేబర్‌గానూ, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ లేబర్‌గాను పనిచేస్తూనే సంఘం కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించారు. సంఘం స్థాపించి 40 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా సంఘం అధ్యక్షుడు టి. వి. దేవదత్ తో ప్రజాశక్తి ఇంటర్వ్యూ........



టి.వి.దేవదత్

ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం ఏర్పడటానికి ప్రధాన భూమిక ఏమిటి?

ప్రపంచంలో ఎక్కడా లేని కుల సమస్య భారత సమాజంలో ఉంది. దీనికి వ్యతిరేకంగా అనేక మంది మహానుభావులు ఎన్నో రకాల ఉద్యమాలు నిర్వహించారు. అయినా రావాల్సినంత మార్పులు రావటం లేదు. కుల రహిత సమాజం ఏర్పడాలనే మహోన్నత లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ కులనిర్మూలన సంఘం ఏర్పడింది. దీనికి వ్యవస్థాపక అధ్యక్షుడు జె.వీరాస్వామి (రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శిగా పని చేసి రిటైర్ అయ్యారు), కార్యదర్శి డి.జె.రామారావు (మున్సిపల్ కార్పొరేషన్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పని చేసి రిటైరయ్యారు).

సంఘం ఆధ్వర్యంలో మీరు తీసుకున్న ప్రధానమైన కార్యక్రమాలేంటి?

కుల మతాంతర వివాహాలను నిర్వహించాలన్నది కర్తవ్యంగా పెట్టుకొన్నాం. అందుకనుగుణంగా నాటి నుండి నేటి వరకు సుమారు వెయ్యికి పైగా కుల మతాంతర వివాహాలను నిర్వహించాం. నేడు ఆయా రంగాల్లో ప్రముఖులుగా ఉన్న వారికి సైతం కులాంతర వివాహాలు చేసుకునే సందర్భంలో చేయూతనందించాం. మేము చేసే పెళ్ళిళ్ళు ఎక్కువగా ఎస్సీల మధ్య, బిసిల మధ్య జరుగుతున్నాయి. అగ్రకులాల మధ్య, ఎస్సీ, బిసీల మధ్య కూడా ఒక మేరకు జరుగుతూనే ఉన్నాయి. కట్న కానుకలకు, కుల, మత సాంప్రదాయాలకు, ఆడంబరాలకు అతీతంగా సాధారణంగా నిరాడంబరంగా జరుగుతున్నాయి.

కులాంతర వివాహాలు నిలబడటం లేదనే విమర్శ ఉంది నిజమేనా?

ఇది మంచి ఉద్దేశంతో చేసే విమర్శ కాదు. ఎందుకంటే నిచ్చన మెట్ల కుల నీతితో నిర్మితమైన వ్యవస్థకు తోడుగా భూస్వామ్య భావజాలం మన కుటుంబ జీవన విధానంలోకి విస్తరించబడి ఉన్నప్పుడు కులమా, మతమా అనే దానితో నిమిత్తం లేకుండానే అందరూ కుటుంబ వివాదాల వలలో చిక్కుకుంటున్నారు. ఇది ఒక వాస్తవం. కులాంతర వివాహాలు చేసుకున్న వారు మాత్రమే వివాదాల్లో ఉన్నారు. ఆ పెళ్ళిళ్ళు మాత్రమే నిలబడటం లేదనే విమర్శ సరైంది కాదు. ఎందుకంటే మేము ప్రతి సంవత్సరం జనవరి 26 (రిపబ్లిక్ డే) సందర్భంగా, ప్రతి హోలీ సందర్భంగా కుల రక్కసి దహన కార్యక్రమం ఆనవాయితీగా నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంలో కుల మతాంతర వివాహాలు చేసుకున్న జంటలను ఆహ్వానిస్తున్నాం. ఎక్కువ సంఖ్యలో వీరు హాజరౌతున్నారు. వీరందరితో సమావేశాలు ఏర్పాటుచేసి, సామాజిక స్పృహ కలిగిన పెద్దలతో ఉపన్యాసాలు ఇప్పిస్తున్నాం. వారిలో ఈ అభిప్రాయాలు లేవు.

కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వ సహాయం ఎలా వుంది?

వీరి ప్రాథమిక అవసరాలకోసం ప్రభుత్వం గతంలో ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించేది. ప్రస్తుతం పది వేలు చేశారు. అయితే ఇది ఎంత మాత్రం సరిపోదు. మీరాకుమార్ మానవ వనరుల శాఖా మంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రతిపాదన పంపారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి కేంద్ర ప్రభుత్వం 25 వేలు, రాష్ట్ర ప్రభుత్వం 25 వేలు ఆర్థిక సహాయం అందించాలని చెప్పారు. ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేశాయి.

కులాంతర వివాహాలు చేసుకున్న వారి ఎడల ప్రభుత్వాల భాధ్యత ఎలా ఉండాలి?

ముందుగా కులాంతర వివాహితులను కులరహితులుగా గుర్తించాలి. వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలి. స్థానిక సంస్థలలోను కార్పొరేషన్లలోనూ, వీరికి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. స్వయం ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలి. రుణాలను మంజూరు చేయడంలోనూ, ఇళ్ళూ, ఇళ్ళ స్థలాలు కేటాయించడంలోనూ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతను ఇవ్వాలి. ప్రభుత్వ భూములను కేటాయించి కులాంతర మతాంతర వివాహితులు తమ ఆర్థిక స్థితిని అభివృద్ధి చేసుకోవడానికి సహకరించాలి.

కులాంతర వివాహాలు చేసుకున్న వారంతా కుల నిర్మూలన కావాలని కోరుతున్నారా?

వాస్తవంగా కులాంతర వివాహాలు చేసుకున్న వారంతా కుల నిర్మూలనాశయంతో ప్రేరేపితులైన వారు కాదు. తనకు అనుకూలమైన వ్యక్తి లభించారు గనుక కుల పరిధుల్ని అధిగమించి వివాహం చేసుకుంటున్నారు. ఆ మేరకు కుల సాంప్రదాయ పరిధుల్ని ధిక్కరిస్తున్నారు. వీరికి కుల వ్యవస్థయొక్క దుర్మార్గాలను అర్ధం అయ్యేలా చూడాలి. వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాలి. ఆ పని చేయాల్సింది కూడా మనమే.

కుటుంబ వ్యవస్థలో వివాహం చాలా ముఖ్యమైనది. అదే సందర్భంలో కులం సమాజంలో వేళ్ళూనుకొని వుంది. కుల దురహంకారం ప్రేమ పెళ్ళిళ్ళను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తుంది. పురోగామి శక్తులు ఈ ధోరణిని నిరసించాలి. అడ్డుకోవాలి. ఈ సమాజ పురోభివృద్ధికి ఉపయోగపడే ఆలోచనలతో కుల, మతాంతర వివాహాలను ప్రోత్సహించి ప్రేమను నింపే దాంపత్యానికి వెలుగు బాటలు వేసి, సమసమాజ నిర్మాణానికై సాగుతున్న ఉద్యమాలకు తోడుగా నిలవాలి.

-ఎస్.వెంకన్న

పుచ్చకాయ రసం

కావలసిన పదార్థాలు

పుచ్చ ముక్కలు - 2 కప్పులు
మిరియాల పొడి - రెండు టీ స్పూన్లు
పుదీనా ఆకులు - 3
ఐస్ ముక్కలు - సరిపడినన్ని (ఇష్టమైతే వేసుకోవచ్చు)

తయారు చేసే విధానం

మిక్సీలో పుచ్చముక్కలు, మిరియాల పొడి, పుదీనా ఆకులు, ఐస్ ముక్కలు వేసి గ్రైండ్ చెయ్యాలి (తీపి సరిపోదనుకునేవారు కొంచెం పంచదార వేసుకోవచ్చు). దీన్ని అరగంట ఫ్రీజర్‌లో పెట్టి తర్వాత సర్వ్ చేయండి. ఎంత ఎండలో వచ్చినవారైనా ఈ పానీయం తాగితే కూల్ కూల్ అయిపోతారు.

ఆరెంజ్ క్రీమ్ సిక్లర్స్

కావలసిన పదార్థాలు

నారింజ ముక్కలు - 1 కప్పు
యాపిల్ ముక్కలు - అరకప్పు
తేనె - 2 టీ స్పూన్లు
పాలపొడి - 2 టీ స్పూన్లు
ఐస్‌ముక్కలు - సరిపడినన్ని

తయారు చేసే విధానం

నారింజముక్కలు, యాపిల్ ముక్కలను విడివిడిగా మిక్సీలో వేసుకోవాలి. యాపిల్ జ్యూస్‌లో ఆరంజ్ జ్యూస్, తేనె, పాలపొడి, ఐస్ ముక్కలు వరుసగా వేసి మళ్లీ గ్రైండ్ చెయ్యాలి. దీన్ని సర్వ్ చేసేముందు కొద్ది సేపు ఫ్రిజ్‌లో పెడితే బాగుంటుంది.



ఫ్రూట్ సావరిన్

కావలసిన పదార్థాలు

మైదాపిండి - 100 గ్రా
గుడ్లు - 2
పాలు - అరకప్పు
ఈస్ట్ - అర టీస్పూన్
పంచదార - పావు కేజీ
వెన్న - 50 గ్రా
క్రీమ్ - 100 గ్రా
మిక్స్‌డ్ ఫ్రూట్స్ - అరకప్పు
వెనిల్లా ఎసెన్స్ - 1 టీస్పూన్

తయారు చేసే విధానం

పావుకేజీ పంచదారలో కొద్దిగా నీళ్లుపోసి పాకం పట్టుకోవాలి. మైదాపిండిలో పాలు, రెండు



స్పూన్ల పంచదార, ఈస్ట్ కలిపి అరగంట సేపు ఉంచాలి. ఇలా ఉంచడం వల్ల పిండి పొంగుతుంది. తర్వాత బాగా గిలక్కొట్టిన గుడ్ల సొన, కరిగించిన వెన్న ఈ మిశ్రమానికి కలిపి మళ్లీ అరగంట నాననివ్వాలి. కేక్ బాక్సుకి అడుగున వెన్న రాసి, దానిపైన పొడి మైదా పిండి చల్లాలి. ఈ గిన్నెలో మైదా మిశ్రమాన్ని వేసి 40 నిమిషాలు ఉడకనివ్వాలి. ఓవెన్‌లోనైతే 200 డిగ్రీల దగ్గర బేక్ చెయ్యాలి. కేక్ ఉడికిన తర్వాత చల్లారనివ్వాలి. ముందుగా చేసిపెట్టుకున్న పంచదార పాకంలో ఎసెన్స్ వేసి ఈ కేక్ పై పొయ్యాలి. తర్వాత పండ్ల ముక్కల్నీ, క్రీమ్‌ని దానిపై అమర్చాలి. దీన్ని కొద్దిసేపు ఫ్రిజ్‌లో పెడితే చల్ల చల్లగా తియ్యతియ్యగా బావుంటుంది.

గ్రేప్ జింజర్ ఆలె

కావలసిన పదార్థాలు

ద్రాక్ష - 1 కప్పు, యాపిల్ - 1, ఐస్ ముక్కలు - సరిపడినన్ని
అల్లం - చిన్న ముక్క, నిమ్మరసం - 2 టీ స్పూన్లు

తయారు చేసే విధానం

ద్రాక్ష పళ్లను పై తోలు తీసి మెత్తని గుజ్జులా చేసుకోవాలి. ఆపిల్ చెక్కుతీసి ముక్కలు కోసుకోవాలి. ద్రాక్షగుజ్జు, యాపిల్ ముక్కలు, అల్లం ముక్కలు కలిపి మిక్సీలో వేయాలి. ఈ మిశ్రమానికి నిమ్మరసాన్ని కలిపి దానికి సరిపడినన్ని నీళ్లు కలిపి, ఐస్ ముక్కలు వేసి తాగేయండి. తీపి ఎక్కువ కావాలనుకునేవారు 2 స్పూన్ల పంచదార వేసుకోవచ్చు.

క్యారమెల్ పుడ్డింగ్

కావలసిన పదార్థాలు

గుడ్లు - 3, పాలు - పావులీటరు
పంచదార - 100 గ్రా, వెనిల్లా ఎసెన్స్ - 2 టీస్పూన్లు

తయారు చేసే విధానం

మూడు టేబుల్ స్పూన్ల పంచదార, కొద్దిగా నీరు మందపాటి గిన్నెలో వేసి మరగనివ్వాలి. అప్పుడు అది తేనెలా తయారవుతుంది. మరో గిన్నెలో మిగిలిన పంచదార, గుడ్ల సొనను కలిపి బాగా గిలక్కొట్టాలి. అందులో పాలు, వెనిల్లా ఎసెన్స్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముందుగా తయారు చేసిపెట్టుకున్న పంచదార పాకంలోవేసి అల్యూమినియం ఫాయిల్‌తో మూసి వేయాలి. దాన్ని ఆవిరి మీద ఉడించాలి. చల్లారిన తర్వాత ఓ ప్లేటులో బోర్లించాలి. అంతే నోరూరించే పుడ్డింగ్ రెడీ.





భవిష్య ఝరి!

కొండల అంచుల నుండి
బంగారు వర్ణపు వెలుగు రేఖలు
నింగిని తాకాలని ఉబలాటపడుతున్నాయి
వేకువకు రెక్కలొస్తే
రోజంతా కాంతి శోభితమేనేమో!

పక్షుల గుంపులు
అనంతాంబరాన్ని
అత్యంత అవలీలగా ఈదుతున్నాయి
ప్రపంచంతా తమ రెక్కల కిందకొచ్చే
సమయమాసన్నమౌతుందేమో!

చెట్లు పొదవైన కొమ్మలతో
దిక్కుల దేహాలను తమలో ఐక్యం చేసుకుంటున్నాయి
కనుమరుగైన ఆత్మవిశ్వాసమంతా
ఇక్కడే తొణికిసలాడుతున్నట్లుంది!

నది
నెమ్మది నెమ్మదిగా
ఒక్కోమలుపు తిరుగుతూ సాగిపోతోంది
అది
గమ్యస్థానాన్ని చేరేవరకు వెనకడుగు వేసేటట్లు లేదు!

పొలం గట్టున
పుట్ట
మౌనంగా ఎదిగిపోతోంది
బాహ్యప్రపంచంతో సంబంధం తెంచుకున్న రుషిలా
తనలో తాను లీనమై ధ్యానం చేస్తున్నట్లు కనిపిస్తుంది!

ఎండిపోయిన ఆకులు
ఏదో తెలియని అలికిడి చేస్తున్నాయి
అప్పుడప్పుడూ గాలికి పైకి లేస్తున్నాయి
ప్రపంచాన్ని కుదిపేసే
కొత్త సృష్టికి సంకేతాలిస్తున్నాయేమో!

చెమ్మ ఆరిన తర్వాత
ఒక్కో గడ్డిరేకు ఒక్కో బల్లెమైంది
అన్నీ ఒక్కసారిగా నింగివైపు తలెత్తి తీక్షణంగా చూస్తున్నాయి
'మార్పు' మంత్రాన్ని వల్లెవేస్తున్నట్లు
చూస్తే ఇట్టే తెలిసిపోతుంది!

పుస్తకంలో పేజీలు
రొజ్జగాలికి టపటపా కొట్టుకుంటున్నాయి
గుడ్డి వెలుతురు దీనంగా చూస్తుంది
అవి నైరాశ్యానికి గుర్తులు కావు
నైరాశ్యం నుండి ఆశయానికి సాగే ఒకానొక ప్రయత్నంలో ఎదురవుతున్న మజిలీలు!
ఉజ్వల భవిష్యత్తుని అణువణువునా నింపుకుంటూ
ఎగిసెగిసి పడుతున్న నెత్తుటి అలలు!

- ఎస్.బి.ఎస్. మౌళి.

కవిత్వం

ఒక విధ్వంసక సౌందర్యం



నేను నడుస్తున్న మేరంతా
ఆకాశం పెళ్లలు పెళ్లలుగా
విరిగి పడుతోంది
నేల ముళ్ల తివాచీ
నెత్తురు నిప్పులు పూస్తోంది
కాలపు దుమారం
కలల్ని కాటేసి పారిపోయింది
తరువు గుండెల్లో దిగబడ్డ పిడుగు
పిడికెడు అణు ధూళిని
ఆహ్లాదంగా పంచుతోంది
మనసు శ్మశానంలో
శవాలు శివాలెత్తి ఆడుతూ
ఒక విధ్వంసక సౌందర్యాన్ని ఆవిష్కరిస్తున్న
కిటికీ రెక్కలకు
గాలి చక్కిలిగింతలు పెడుతోంది
దీపం చీకటిని సన్నగా కాల్చేస్తుంటే
రాత్రి అబద్ధాల్ని అమ్ముకుంటోంది
చూరట్టుకు జారే చుక్కల చుట్టూ
వలయాలు వలయాలుగా దిగుళ్లు
ఊపిరి పక్షులకు మాత్రం
రేపటి ఆమని పూల కొమ్మపై వాలాలని
ఒట్టి వ్యర్థపు ఆశలు!
ఈ రాత్రి ఎందుకింత
సుదీర్ఘంగా పెరిగిపోతోంది?
కొండ చిలువ చుట్టుకున్న వన్యప్రాణిలా
రెపరెపలాడుతూ నాలో నేను
అయినా ఎక్కడికని పారిపోవడం
నేను నడుస్తున్న మేరంతా
ఆకాశం పెళ్లలు పెళ్లలుగా విరిగిపడుతోంటే...

- కొండెపోగు బి. డేవిడ్ లివింగ్‌స్టన్



నవ్వుల్ - పువ్వుల్

ఎవరనుకున్నావ్?

భార్య : ఏవండీ! మీకు ఈ ఏడాది రాశిఫలితాలలో ఆదాయం 8, ఖర్చు 11. మిగతా 3 రూపాయలు ఎవరిస్తారంటారు?
భర్త : మీ నాన్న!

వింత కరువు

టీచర్ : గోపీ! మనుషులు ఆకాశంలో ఎగురుతూ తిరిగే రోజులు వస్తే ప్రపంచం ఎలా ఉంటుంది?
గోపీ : రైళ్లు, బస్సులు, కార్లు, విమానాలు, ఆటోలకు ప్రయాణీకుల కరువు ఏర్పడుతుంది.

ఉచితం

సేల్స్ గర్ల్ : మేడమ్! మా కంపెనీ తైలం మీరు గనుక వాడితే మీ తల వెంట్రుకలు నల్లగా, వత్తుగా బారెడు పొడుగు పెరుగుతాయి.
గృహిణి : తైలం సీసాతో ఏదైనా వస్తువు ఉచితంగా ఇస్తున్నారా?
సేల్స్‌గర్ల్ : వెంట్రుకలు కొలుచుకోవడానికి ఉచితంగా స్కేల్ ఇస్తాం మేడం.

అప్పు

కస్టమర్ : ఈ రోజు మీ యజమాని ముఖం కళకళలాడుతుంది ఏమిటి?
సప్లయర్ : ఆయనకు నిన్న రెండు లక్షలు అప్పు దొరికిందిలే. అందుకని.

ఎప్పుడు?

జలజ : సర్! నా జీతం ఎప్పుడు పెరుగుతుంది?
బాస్ : నీకు తెలుగు భాష క్షుణ్ణంగా రాయడం, చదవడం వచ్చిందని నేను గమనించినప్పుడు.

రుణ విముక్తి

శిష్యుడు : గురువుగారు, నా చేత తాగుడు మాన్పించారు. జూదం మాన్పించారు. ఏమిచ్చి మీ రుణం తీర్చుకోగలను చెప్పండి?
గురువు : అంతగా చింతించవలసిన పనిలేదు శిష్యా. నీకున్న పది ఎకరాల పొలంలో ఏడు ఎకరాలు మన ఆశ్రమానికి దానం చేస్తే చాలు నాయనా!

జె.సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

సెటిలయ్యారా!

విలేకరి : ఏమిటి మీ మొదటి సినిమాతోనే జీవితంలో సెటిలయ్యారా! ఎలా?
సినీనటి : మరే! హీరోయిన్ లైఫ్ ఒక సినిమాకే పరిమితం కదా. ముందు చూపుతో హీరోనే ప్రేమించి పెళ్లి చేసుకున్నా.

కొత్త ప్రణాళిక

విలేకరి : తరచూ ప్రజలకు ఏమీ చేయలేకపోయానంటారు కదా. మీ కొత్త ప్రణాళిక ఏమిటి?
రాజకీయ నాయకుడు : ఓటర్ల పుట్టిన రోజుని జ్ఞాపకం పెట్టుకుని శుభాకాంక్షలు చెపుదామనుకుంటున్నాను. అలాగే ప్రతి పండక్కి కూడా చేస్తాను.

ఓ.శివరామకృష్ణ, విజయవాడ.

చెమటకాయలు

రోగి: డాక్టర్! నాకు చమటకాయలు బాగా వచ్చాయి. వెంటనే తగ్గే మార్గం ఏదైనా చెప్పండి.
డాక్టర్: ఇదిగో ఈ మందు వాడు.
రోగి: ఇది వాడితే వెంటనే తగ్గుతుందా డాక్టర్.
డాక్టర్: లేదు. నీకు గోళ్లు బాగా పెరగడానికి ఆ మందు రాశాను. గోక్కుంటే నీకు వెంటనే రిలీఫ్ వస్తుంది.

కళ్లజోడు

రోగి: డాక్టర్! నాకు కళ్లజోడు అవసరమేమో అనిపిస్తోంది.
వ్యక్తి: సార్! మీరు అన్నది కరెక్టే. ఎందుకంటే...ఇది బ్యాంకు. నేను క్యాషియర్‌ని.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్



అభినయ ప్రదర్శనతో పని లేకుండా అవయవ ప్రదర్శనదే ప్రాధాన్యమైన ప్రస్తుత సినిమా ప్రపంచంలో గుర్తుండే కథానాయికల పేర్లు, ముఖాలు అతి తక్కువ. కానీ, రెండు దశాబ్దాల క్రితం పరిస్థితి అలాంటిది కాదు. పాత్రను బట్టి అభినయానికీ, అందానికీ సమయోచిత ప్రాధాన్యం కల్పించే నాయికలు కనిపించేవారు. ఆ తరం నాయికల్లో సుజాత ఒకరు. ఆమె చూపిన అభినయం ఇవాళ్టికీ ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయింది. అందుకే, ఏప్రిల్ 6వ తేదీన చెన్నైలో సుజాత అకాల మరణ వార్త తెలియగానే చాలా మందికి మనసు చివుక్కుమంది. అందచందాల ప్రదర్శనతో కాక అభినయంతోనూ, ఆత్మ విశ్వాసం నిండిన పాత్రలతోనూ అభిమానులను సంపాదించుకున్న ఓ మంచి నటి దూరమైనందుకు తెలుగు, తమిళ, మలయాళ సినీ ప్రియులు బాధపడ్డారు.

అభినయ ప్రధాన పాత్రలకు అందమైన చిరునామా

చారడేసి కళ్ళు, ముచ్చటైన ముఖం, తీర్చిదిద్దినట్లుండే శరీరం, హుందాతనం నిండిన అలంకరణ, వస్త్రధారణలతో సుజాత ఎవరికి వారికి తమ ఇంట్లో అమ్మాయిలా అనిపించేవారు. నిజానికి, సుజాత మలయాళ అమ్మాయి. వాళ్ళ సొంత ఊరు కేరళలోని ఎర్నాకుళం జిల్లాలోని మరదు. కానీ, తండ్రి ఉద్యోగ రీత్యా శ్రీలంకలో స్థిరపడ్డారు. సుజాత పుట్టింది, పెరిగింది – శ్రీలంకలోని గాలే ప్రాంతంలో. 1952 డిసెంబర్ 10న ఆమె జన్మించారు. ఎనిమిదిమంది తోబుట్టువుల్లో సుజాత ఒకరు. ఆమెకు ముగ్గురు అన్నయ్యలు, ముగ్గురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు.

రంగస్థలి నుంచి రంగుల లోకంలోకి...

సుజాత ఇంగ్లీషు బాగా మాట్లాడేవారు. కానీ, అసలు ఆమె పెద్దగా చదువుకోలేదనీ, కనీసం పదో తరగతి దాకా అయినా బడికి పోలేదనీ తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. సినిమాల్లో ఆమె ప్రవేశం కూడా గమ్మత్తుగా జరిగింది. 1966లో తండ్రి రిటైరయ్యాక, సుజాతకు 13 ఏళ్ళ వయస్సులో వాళ్ళ కుటుంబం మళ్ళీ కేరళకు వచ్చేసింది. అప్పట్లో 'సినిమా మాసియా' అని మలయాళంలో ఓ మాసపత్రిక వచ్చేది. "మా పక్కింటి అంకుల్ వాళ్ళ కుటుంబంతో నేను స్నేహంగా ఉండేదాన్ని. ఆయన నా ఫోటోను ఆ పత్రికకు పంపారు. పత్రికలో నా ఫోటో రావడంతో, తమ నాటకాల్లో నటించాల్సిందిగా చాలా మంది అడిగేవారు. మా అన్నయ్యకు నాటకాలన్నా, సినిమాలన్నా ఇష్టం. అన్నయ్య ప్రోద్బలం వల్ల నటించడం మొదలుపెట్టాను" అని సుజాత ఒక సందర్భంలో చెప్పారు. అలా ఆమె రంగస్థల కళాకారిణిగా అడుగులు వేశారు. మలయాళ మేకప్‌మన్ జోస్ ప్రకాశ్ సాయంతో 'పోలీస్ స్టేషన్' అనే మలయాళ నాటకంతో ఆమె రంగస్థలం మీదకు వచ్చారు. అలా నాటకాలు వేస్తుండగానే సినీ నిర్మాతల దృష్టిలో పడ్డారు.

పదిహేనో ఏట 1967లో సుజాత సినీ జీవితం మొదలైంది. మలయాళ చిత్రం 'తబస్విని' ఆమె తొలి చిత్రం. ఆ తరువాత తమిళంలో, ఆ పైన తెలుగులో ఆమెకు అవకాశాలు వచ్చాయి. ప్రముఖ దర్శకుడు కె. బాలచందర్ దర్శకత్వంలో 'అవళ్ ఒరు తొడర్ కదై' చిత్రం ద్వారా 1974లో సుజాత తమిళ చిత్ర పరిశ్రమలో ప్రవేశించారు (ఇదే చిత్రం తెలుగులో 1976లో 'అంతులేని కథ'గా జయప్రదతో రీమేకైంది). కుటుంబ బాధ్యతలను మోసే పట్టణప్రాంత ఉద్యోగిని పాత్రను సుజాత పోషించిన తీరు అప్పట్లో ఓ సంచలనమైంది. ఆ చిత్ర ఘనవిజయంతో సుజాతకు ఎన్నో సినిమా అవకాశాలు వచ్చాయి. శివాజీ గణేశన్, శివకుమార్, రజనీకాంత్, కమలహాసన్, విజయకుమార్ తదితర ప్రముఖ తమిళ హీరోల సరసన నాయిక పాత్రలను ఆమె ధరించారు. 'అవళ్ ఒరు తొడర్ కదై', 'విధి' లాంటి తమిళ చిత్రాల్లో విప్లవాత్మక ధోరణిలోని పాత్రలు పోషించిన ఈ అభినేత్రి కుటుంబ కథా చిత్రాల్లోని బరువైన పాత్రలను పోషించడంలోనూ అంతకు మించి పేరు సంపాదించారు. తమిళంలో ఆమె నటించిన 'సెందమిళ్ పాట్టు', 'అవళ్ ఒరువాళా' తదితర చిత్రాలు అందుకు నిదర్శనం.

సుజాతది ప్రేమ వివాహం. 1977 ప్రాంతంలో తమిళ చిత్రాల్లో తీరిక లేకుండా నటిస్తున్న సుజాత చెన్నైలో తాము అద్దెకున్న ఇంటివాళ్ళ అబ్బాయి జయకర్ హెన్రీని ప్రేమించారు. ఆ ప్రేమే, పెద్దల అభ్యంతరాలను కూడా లెక్కచేయకుండా పెళ్ళికి దారి తీసింది. తరువాత అమెరికా వెళ్ళినా, అక్కడి అలవాట్లు, సంప్రదాయాలు నచ్చని సుజాత కాన్పు కోసం భారతదేశానికి వచ్చి, భర్తతో కలసి ఇక్కడే ఉండిపోయారు.

తెలుగులో పండిన 'గోరింటాకు'

తెలుగులో తొలి చిత్రం 'గోరింటాకు' (1979)తోనే ఆమె తెలుగు చిత్రసీమలో బలమైన ముద్ర వేశారు. 'యువచిత్ర' పతాకంపై దాసరి నారాయణరావు దర్శకత్వంలో నిర్మాత కె. మురారి నిర్మించిన ఆ చిత్రంలో హీరో శోభన్‌బాబు సరసన ఆమె పోషించిన పాత్ర ఇవాళ్టికీ సినీ ప్రియులకు మరపురానిదే. "అప్పట్లో 'గోరింటాకు' చిత్రంలో కొత్త కథానాయిక కోసం వెతుకుతున్నాం. అప్పుడు బాలచందర్ గారి సాయంతో సుజాతను హీరోయిన్‌గా ఎంపిక చేశా. షూటింగ్ సమయంలో ఆమె నటన చూసి ఎంతో ఆశ్చర్యపోయాను. ఆ చిత్రంలో 'కొమ్మ కొమ్మకో సన్నాయి...', 'ఎలా ఎలా దాచావు అలవి కాని అనురాగం...' లాంటి పాటల్లో ఆమె నటన చాలా సహజంగా ఉంటుంది" అని అప్పటి సంగతులను మురారి గుర్తు చేసుకున్నారు. అలాగే, 'సంధ్య' (1980) లాంటి తెలుగు చిత్రాల్లో సుజాత పోషించిన త్యాగమయమైన పాత్రలు అప్పటికీ, ఇప్పటికీ మనస్సును చెమరింపజేస్తాయి.

గమ్మత్తేమిటంటే – 'గోరింటాకు' అవకాశం వచ్చినప్పుడు సుజాత ముందు ఒప్పుకోలేదట! తెలుగు తెలియదు కాబట్టి, తెలియని భాషలో డైలాగులు చెప్పేటప్పుడు అందరూ నవ్వితే అవమానకరం కాబట్టి, నటించనని ఆమె చెప్పారు. కానీ, 'గోరింటాకు' చిత్ర రచయిత్రి కె. రామలక్ష్మీ ఆరుద్ర వదలకుండా, తాను దగ్గరుండి ప్రతిదీ నేర్పుతాననే సరికి, బలవంతం మీద సుజాత ఒప్పుకున్నారు. 'గోరింటాకు' చిత్రంలో ఏడుస్తూ ఓ పెద్ద డైలాగు చెప్పడానికి 16 టేకులు తిన్న సుజాత ఆ తరువాత పట్టుబట్టి తెలుగు నేర్చుకున్నారు. మొదట్లో సరిత, ఆ తరువాత ఇతరులు డబ్బింగ్ చెప్పినా, అటు పైన తెలుగు మీద పట్టు సంపాదించి, సొంతంగా సంభాషణలు చెప్పుకున్నారు. వృత్తి పట్ల అంకితభావం ఉన్న సుజాత తొలి రోజుల్లో సైతం "పెద్ద స్టార్ హీరోయిన్‌ని అనే గర్వం కానీ, ఆడంబరం కానీ మచ్చుకైనా చూపించేవారు కాదు. అలాంటి మంచి మనిషి, గొప్ప నటి" అని హీరో కమలహాసన్ సైతం ఇటీవల అన్నారు.

పెద్ద వయసు పాత్రల్లోనూ ప్రతిభావిష్కరణ

విచిత్రంగా - కథానాయిక పాత్రలు వేసిన రోజుల నుంచి కూడా సుజాత గ్లామర్ పాత్రలు ధరించింది చాలా తక్కువ. తెలుగులో ఎన్టీఆర్ (‘సర్కస్ రాముడు’ - 1980), ఏయన్నార్ (‘గురుశిష్యులు’ - 1981), శోభన్‌బాబు (‘గోరింటాకు’ - 1979), కృష్ణంరాజు (‘బెబ్బులి’ - 1980) లాంటి అప్పటి అగ్ర హీరోల సరసన నటించినప్పుడు కూడా ఆమె పాత్రల్లో హుందాతనమే ఎక్కువ. చిరంజీవితో ‘ప్రేమతరంగాలు’ (1980)లో నటించిన సుజాత 1980ల చివరినాటి కల్లా ఆమె పెద్ద వయసు పాత్రలు పోషించడం మొదలుపెట్టేశారు. అక్కినేనితో ‘బహుదూరపు బాటసారి’ (1983), ‘జస్టిస్ చక్రవర్తి’ లాంటి చిత్రాల్లో ఆమె పోషించిన పెద్ద తరహా పాత్రలు సైతం ప్రేక్షకుల్లో ఓ ఇమేజ్‌ను నిలిపాయి. అలాగే, గతంలో తాను హీరోయిన్‌గా నటించిన రజనీకాంత్, కమలహాసన్‌లకు తల్లిగానూ సుజాత నటించారు. అందుకు రజనీకాంత్ ‘బాషా’ చిత్రమే ఈ మధ్య కాలపు ఉదాహరణ. ‘ఏడంతస్తుల మేడ’ (1980) తన చిత్రాల్లో తనకు బాగా నచ్చిన తెలుగు సినిమా అని చెప్పిన సుజాతకు ‘పసుపు - పారాణి’ (1980), ‘సుజాత’ (1980), ‘సంధ్య’ (1980), ‘గుప్పెడు మనసు’ (1979), ‘వంశ గౌరవం’ లాంటి చిత్రాలు ఆమెతో పాటు జనానికీ నచ్చాయి.

మధ్యతరగతి ఇల్లాలిగా, కుటుంబం బరువంతా మోసే వనితగా మంచితనం, త్యాగం నిండిన పాత్రలకు ఆమె ప్రతీకగా నిలిచారు. ‘సీతాదేవి’ చిత్రంలో వికలాంగురాలిగా ఆమె చక్కటి నటన ప్రదర్శించారు. “భావోద్వేగ నటనకు సుజాత పెట్టింది పేరు. కెమేరా ముందు మాత్రమే అభినయించడం గొప్ప కాదు. డబ్బింగ్ సమయంలోనూ వాచికంలో ఆమె అంతే భావోద్వేగాలను పలికిస్తారు. అప్పట్లో తమిళనాట ఇళయరాజా సంగీతం ఉంటే సినిమాలు హిట్టయ్యేవి. అలాగే, సుజాత నటించినా చాలు, ఆ చిత్రాలు బ్లాక్‌బస్టర్లే!” అని సుజాతతో 12 చిత్రాల్లో కలిసి నటించిన తమిళనాట ప్రముఖ సీనియర్ నటుడు శివకుమార్ చెప్పారు. పెద్ద వయస్సు పాత్రలకు మళ్ళాక, 1990లలో ఆమె ‘సూత్రధారులు’, ‘చంటి’, ‘సూరిగాడు’ లాంటి పలు చిత్రాల్లో నటించారు. ‘చంటి’ చిత్రంలో హీరో వెంకటేశ్ తల్లిగా ఆమె పాత్ర ఒక కోణంలో సాగితే, ‘పెళ్ళి’ చిత్రంలో కోడలి బాగు కోసం కొడుకుకు విషమిచ్చే తల్లి పాత్ర మరో కోణంలో నడుస్తుంది. రెంటినీ ఆమె సమర్థంగా పోషించారు. ‘పెళ్ళి’ చిత్రంలోని పాత్రకు ఉత్తమ సహాయ నటిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారు. ఇటీవల ‘శ్రీరామదాసు’లో భద్రాచల సీతారామ విగ్రహాలను సంరక్షించే భక్తురాలు దమ్మక్క పాత్రలో జీవించారు. తమిళంలో ‘వరలారు’, తెలుగులో ‘వెంగమాంబ’ ఆమె చివరి చిత్రాలు.

పుట్టుక రీత్యా మలయాళీ అయినా, సుజాత తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో దాదాపు 300 దాకా చిత్రాల్లో నటించారు. సెట్స్‌లో ఎవరితోనూ మాట్లాడకుండా, ముభావంగా ఉండడం మొదటి నుంచీ సుజాతకు అలవాటు. దాంతో, సుజాతకు పొగరెక్కువ అని ప్రచారం చేసినవాళ్ళూ ఉన్నారు. “హంగామా లేకుండా అభినయం ద్వారా ఆకట్టుకొనే నటి సుజాత. పెళ్ళయిన తరువాత ఆమె ఎక్కువగా కుటుంబం మీద శ్రద్ధ చూపెడుతూ వచ్చారు. సెట్స్‌లో కూడా తన పనిలో తాను మునిగిపోయేవారు. గడచిన కొన్నేళ్ళుగా ఆమె సినీ పరిశ్రమకూ, బహిరంగ కార్యక్రమాలకూ దూరంగా కాలం గడుపుతూ వచ్చారు” అని వెండితెరపై సుజాత తొలి చిత్రంలో ఆమెతో కలసి నటించిన తమిళ - తెలుగు సినీ నటుడు విజయకుమార్ చెప్పారు.

ఆఖరి రోజుల్లో బాధించిన అనారోగ్యం

గడచిన కొన్నేళ్ళుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూత్రపిండాలు దెబ్బతినడంతో ఆమె క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. అది అలా ఉండగా, హృద్రోగం కూడా తలెత్తడంతో, మార్చి నెలలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆమెకు పేస్‌మేకర్‌ను ఏర్పాటుచేస్తూ, శస్త్రచికిత్స చేసినట్లు అభిజ్ఞవర్గాలు తెలిపాయి. ఆ శస్త్రచికిత్స నుంచి పూర్తిగా కోలుకోక ముందే గుండెపోటుతో సుజాత హఠాన్మరణం పాలయ్యారు. సుజాత, వ్యాపారవేత్త జయకర్ హెన్రీ దంపతులకు ఓ అబ్బాయి (సజీత్), ఓ అమ్మాయి (దివ్య).

ఇన్నేళ్ళుగా సినిమా రంగంలో ఉన్నా, ప్రచార ఆర్భాటాలకు దూరంగా, తన కన్నా తాను పోషించిన పాత్రలతోనే జనానికి సన్నిహితంగా మెలగడం సుజాతలోని విశిష్ట లక్షణం. 1970లు, ’80లలో అభినయ ప్రధానమైన నాయిక పాత్రలు పోషించాలంటే, దర్శక, నిర్మాతలు అనివార్యంగా ఆమెనే ఎంచుకొనేవారు. నిజానికి, దర్శకుడు బాలచందర్ తీసుకువచ్చిన ఈ వజ్రం తమిళ, తెలుగు సినిమాల్లోకి వచ్చేనాటికి సినిమా హీరోయిన్లంటే టీనేజ్ అమ్మాయిలనే భావమే ఎక్కువ. అయిదు పదులు మీద పడిన అగ్ర హీరోలకు సైతం కుర్ర హీరోయిన్లే కథానాయికలు. వాళ్ళతో పోలిస్తే, వయస్సులోనూ, పరిణతిలోనూ పెద్దదైన సుజాత నాయికగా నిలదొక్కుకోవడం ఇవాళ వెనక్కి తిరిగి చూస్తే ఆశ్చర్యకరమే.

‘శ్రీరామదాసు’లో .... దమ్మక్కగా

అందంలో, అభినయంలో హుందాతనం

‘గోరింటాకు’ చిత్రం షూటింగ్ సమయానికే బిడ్డ తల్లి అయిన ఆమె, పసివాణ్ణి వెంట వేసుకొని షూటింగ్‌కు వచ్చేవారు. నాయిక పాత్రల నుంచి తల్లి పాత్రలకు మారినా, ఎబ్బెట్టుగా తోచకుండా, అభినయంతో పాత్రకు నిండుదనం చేకూర్చడం సుజాతలోని ప్రత్యేకత. అందమైన ముఖం, ఎడమ వైపు బుగ్గ మీద అందమైన చిన్న పుట్టుమచ్చ, ఒంటికి సరిగ్గా అతికినట్లు కుట్టించుకున్న జాకెట్ల, సాదాగా ఉన్నా చక్కటి కేశాలంకరణ, గంజి పెట్టినట్లు బిగుతుగా ఉండే కాటన్ చీర, అందుకు తగ్గ అలంకరణతో సుజాత ఎప్పుడూ హుందాగా కనిపించేవారు. “ఎప్పుడూ ఆమె ముఖంలో చిరునవ్వే కనిపించేది. అలసట కనపడేది కాదు. ఆమె పరాయి భాషకు చెందిన అమ్మాయి అయినా, తెలుగు చిత్రాలతో తెలుగు ఆడపడుచుగానే గుర్తింపు పొందారు” అని బాలచందర్ ‘గుప్పెడు మనసు’తో సహా పలు చిత్రాల్లో సుజాతతో కలసి నటించిన శరత్‌బాబు పేర్కొన్నారు.

దక్షిణాది భాషా చిత్రాల్లో ప్రముఖ నటిగా పేరు తెచ్చుకున్న సుజాత ఎంత పెద్ద హీరోతో నటించినా, వాళ్ళకు దీటుగా అభినయిస్తూ, కొన్నిసార్లు వాళ్ళ కన్నా ఎక్కువ మార్కులు తానే సంపాదించేవారు. హీరోలదే రాజ్యమైన చిత్ర పరిశ్రమలో వివిధ భాషల్లో హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలకూ, వాటి బాక్సాఫీస్ విజయానికీ ఈ అభినేత్రి చాలా కాలం మూలస్తంభంగా నిలిచారు. అప్పట్లో నటించిన చిత్రాల్లో అధిక భాగం బలమైన ఇతివృత్తం, బిగువైన కథనాలతో కూడుకున్నవి కావడం కూడా ఆమెకు సానుకూల అంశమైంది. అలాగే, అతిగా భావావేశాల ప్రదర్శనే వెండితెరపై రాజ్యమేలుతున్న రోజుల్లో ఆమె సున్నితమైన హావభావాలతో, అండర్ ప్లే ద్వారా పాత్రను ప్రేక్షకుల మనస్సుల్లోకి జొప్పించేవారు. నాట్యం నేర్చుకోకపోయినా, ఆమె తన వెడల్పాటి కళ్ళతో సులభంగా నవరసాలూ పండించేవారు. అందుకే, “నా చిత్రాల్లో నటించిన హీరోయిన్లందరిలోకీ చాలా చక్కటి నటి - సుజాత” అని చెప్పే నిర్మాత మురారి అన్నట్లు, “సావిత్రి లాంటి నటనా చాతుర్యం ఉన్న మనిషి సుజాత. అభినయ ప్రధానమైన పాత్రలకు చిరునామా అయిన ఆమె మరణం నిజంగా విషాదం.”

- రెంటాల జూనియర్

బొమ్మల లైబ్రరీ



ఈరోజుల్లో పిల్లల్ని చూస్తే ఏమనిపిస్తుంది? లేచింది మొదలు నిద్రపోయే వరకు ఒక టైమ్ టేబుల్ ప్రకారం నడుచుకునే రోబోల్లానా! కాస్త అతిగా అనిపించినా నిజం అదేనండీ బాబూ! పొద్దున్నే లేవగానే స్నానాలు...టిఫిన్లు...స్కూలుకు సిద్ధం కావడాలు...భుజాన తాబేలు డిప్పలా స్కూలు బ్యాగు తగిలించుకోగానే ప్రయాణం మొదలౌతుంది. బడి...పాఠాలు...ట్యూషన్లు...తర్వాత కాసేపు టీవీ చూసే భాగ్యం వుంటే వుంటుంది. లేకపోతే లేదు. హోంవర్క్ పూర్తిచేసిన వారికి మాత్రమే ఆ ఛాన్సు. అలా కాకుండా వారి ప్రపంచంలో వారికెంతో ఇష్టమైన ఆటలకు స్థానం కల్పిస్తే...ఎలా వుంటుంది? ఆ... ఆలోచనే పిల్లల కళ్లల్లో మెరుపులు మెరిపిస్తుంది కదూ!

ఈ ఆలోచన ముంబైకి చెందిన శివలాల్ దేశాయ్‌కి వచ్చింది. దాని ఫలితమే 'టాయ్ ఫౌండేషన్' ఏర్పాటు. ఈ ఖేల్ విజ్ఞాన్ కారణంగా 50 స్కూళ్లలో ఆట బొమ్మల గ్రంథాలయాలున్నాయి. అలాంటి ఒక స్కూలు మతుంగా మున్సిపల్ స్కూలు. ఇక్కడి పిల్లలు సాయంత్రం స్కూలు అయిపోయాక నీరసంగా నడుచుకుంటూ ఇంటికి వెళ్లరు. నిజం చెప్పాలంటే వారిలో అప్పుడే సంతోషం ఉప్పొంగుతుంది. మరి అప్పుడు ఎంచక్కా కొత్త కొత్త బొమ్మలతో ఆడుకునే వీలుంటే అంతే కదా. టీచర్ చెప్పే రాజుల కథలు వినే అవకాశముంటే ఇంక ఎగిరి గంతేయరూ. రంగులతో బొమ్మలేసే సౌకర్యముంటే కాళ్లీడ్చుకుంటూ ఇంటికెందుకెళతారూ! హాయిగా అక్కడే కూర్చుని తమ ఊహలోకాన్ని తెల్ల కాగితంలోకి రంగుల సాయంతో బట్వాడా చేసేయరూ. మతుంగా స్కూలు పిల్లలు అదే చేస్తారు.

ఖరీదైన బొమ్మలతో ఆడుకునే వెసులుబాటు, ఆటలకోసం ప్రత్యేక ఆటల శిబిరాల్లో చేరే స్తోమతు లేనప్పుడు ఇలాంటి బొమ్మల గ్రంథాలయాలే వారికి ఎంతో ఉపయోగపడతాయి. అందుకే దేశాయ్ ఎంతో శ్రద్ధతో పేద పిల్లలకు ఆడుకునే వాతావరణం కల్పించాలనుకున్నారు. ఖేల్ విజ్ఞాన్ కేంద్రాలుండేది ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే. మురికి వాడల్లోనే. అక్కడ పిల్లలు రోబో బొమ్మలతో ఫైటింగ్ చేస్తారు. తల్లీపిల్లల బొమ్మలతో ముద్దులాడతారు. అంతా కలిసి అల్లరే అల్లరి. ఆటలే ఆటలు. ఇవే కాదు. ఖేల్ విజ్ఞాన్‌లో మెదడుకు పదును పెట్టే పజిల్స్ పుస్తకాలూ వుంటాయి. కేవలం బడికెళ్లే పిల్లలకే కాదు. వీధి బాలలకూ ఆటల గ్రంథాలయంలో ప్రవేశం వుంది.

పిల్లలకు కేవలం పాఠాలే కాదు. చదవడం రాయడం మాత్రమే కాదు. వారిలో ఆనందోత్సాహాలను నింపే, తెలివితేటలకు పదునుపెట్టే అవకాశం కల్పించడమే ఖేల్ విజ్ఞాన్ ఉద్దేశ్యం. పిల్లలకు ఆటలతో బంధాలు తెలుస్తాయి. ప్రణాళికలు వేయడం నేర్చుకుంటారన్నది దేశాయ్ మాట. అయితే ఇక్కడ మరో సౌకర్యం కూడా వుంది. అదేంటంటే పిల్లలు ఇక్కడినుంచి ఆటవస్తువులను ఇంటికి కూడా తీసుకెళ్లొచ్చు. కాకపోతే అందుకోసం వంద రూపాయలు పొదుపు చేయాల్సి వుంటుంది. అయితే వాటిని తిరిగి ఇచ్చేస్తారండోయ్. ఎప్పుడంటే...పిల్లలకు పాఠశాల విద్య పూర్తయిన రోజున. అదే టాయ్ లైబ్రరీలో సాధారణ సభ్యత్వం పొందాలంటే మాత్రం పది రూపాయలు చెల్లించాల్సివుంటుంది.


శివలాల్ దేశాయ్

ఈయనది ముంబైలో స్థిరపడ్డ వ్యాపార కుటుంబం. ఈయన చిన్నప్పుడు అక్కడి చాచా నెహ్రూ బొమ్మల లైబ్రరీకి వెళ్లేవారు. ఈయనే కాదు! వేలాది మంది పిల్లలకు ప్రతి ఆదివారం నాడు టాయ్ లైబ్రరీ ఒక ప్రముఖ సందర్శనీయ స్థలం. అక్కడ అన్ని సౌకర్యాలను ఉచితంగా పొందవచ్చు. ఆరోజుల్లో ముంబై చిన్నారులకు అదే డిస్నీల్యాండ్. కాకపోతే ప్రభుత్వ నిర్లక్ష్యంతో అది 1984లో మూతపడింది. బాల్యంలో తాను పొందిన సౌకర్యాన్ని నేటి బాలలకు అందివ్వాలన్నది దేశాయ్ ఆలోచన. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ భవనంలో 'ఖేల్ విజ్ఞాన్'ను ఏర్పాటు చేశారు. ప్రాథమికంగా 22వేల రూపాయలతో ఆటవస్తువులు కొనుగోలు చేశారు. మెల్లగా మిత్రుల సాయం అందసాగింది. దాంతో తన ఆఫీసుకు దగ్గర్లో మరో కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆయన సాయంత్రాలు అక్కడ పిల్లల మొహాల్లో ఆనందం చూడందే రోజు ముగియదంటారు దేశాయ్. ప్రస్తుతానికి చిల్డ్రన్ టాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 13 రాష్ట్రాల్లో 260 ఖేల్ విజ్ఞాన్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఎక్సెల్ ఇండస్ట్రీస్ సాయంతో '98లో మొబైల్ ఖేల్ కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ బస్సు ఉత్తర భారతదేశంలో చిన్నారులకు ఆటవస్తువులను అందిస్తుంటుంది. ఈ మొబైల్ కేంద్రాల్లో వీడియో గేమ్స్ కూడా అందుబాటులో వుంటాయి. ఖేల్ విజ్ఞాన్ కేంద్రాలను కేవలం పాఠశాలలకే పరిమితం చేయకుండా ఆసుపత్రులు, అనాథాశ్రమాలు, జైళ్ల ఆవరణలోనూ ఏర్పాటుచేస్తున్నారు. ముంబై తర్వాత ఎక్కువ ఖేల్ విజ్ఞాన్ కేంద్రాలు నడుస్తోంది సూరత్‌లో. అక్కడ 35 మున్సిపల్ స్కూళ్లలో ఈ కేంద్రాలున్నాయి.

వీటివల్ల ఓ ప్రయోజనం కూడా నెరవేరుతోందంటే ఆశ్చర్యం వేస్తుంది. పిల్లలు వీటితో ఆనందంగా ఆడుకోవడమే కాదు. ఆటల గ్రంథాలయాలు వచ్చాక పాఠశాలల్లో హాజరు పెరగడమే కాక...పిల్లలకు లెక్కల్లో చురుకుదనం, విషయ గ్రహణంలో వేగం పెరుగుతోందని టీచర్లు, తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు. ★

కావ్య పుస్తకాలు

కవిత్వంలో కదన కళ

యుద్ధ కళ ప్రపంచంలో అతి క్లిష్టమైంది, కష్టమైంది కూడా. తక్కిన కళలన్ని ఎవరి సృజనను బట్టి వారు నిర్వహించుకోవచ్చు. యుద్ధ కళలో మాత్రం అవతలి వారి పోటీని తట్టుకోవాలి, అధిగమించాలి, చేతనైతే ఓడించాలి. యుద్ధం అంటే రణభూమిలో సైన్యాలు తలపడడమే కాదు. దైనందిన జీవితంలో వివిధ రంగాలలో ఎదురయ్యే సవాళ్లు ఏవైనా కావచ్చు. సైన్యం అంటే కాల్బలమే కానక్కర్లేదు, శక్తియుక్తులు సవ్యంగా వాడుకోవడమే కావచ్చు. పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను అని శ్రీశ్రీ అన్నట్టు అనుక్షణం అనుదినం ఘర్షణలోనే చరిత్ర రూపు దిద్దుకుంటుంది. క్రీ.పూ.500 సంవత్సరాల నాడు చైనాలో సన్ జూ అనే సైనిక నిపుణుడు మేధావి రూపొందించిన కదన సూత్రాల కవనమే 'యుద్ధతంత్రం'. జాన్ మిన్‌ఫర్డ్ చైనీస్ భాష నుంచి ఆంగ్లీకరించగా క్రాంతిమిత్ర తెలుగు వారికి అందజేశారు. 112 పేజీల ఈ చిన్న కావ్యంలో ప్రతి చరణమూ కర్తవ్య నిర్దేశం చేసేదిగా వుంటుంది. కర్తవ్యోన్ముఖం చేస్తుంది. కవిత్వంలా కనిపిస్తూనే నిత్య జీవిత భాషలో నిరాడంబరంగానూ నిశితంగానూ సాగుతుంది. 'యుద్ధం జీవన్మరణాల నిర్ణాయక స్థలి/ చావో రేవో తేల్చేసే దారి/ యుద్ధం సాహసోపేత నిర్ణయాల క్రీడ' అంటూ మొదలవుతుంది.యుద్ధంలో మార్గం, స్వర్గం, భూమి, ఆదేశం, క్రమశిక్షణ అన్న అయిదు ప్రాథమికాంశాలు వుంటాయంటాడు



సన్‌జూ. ఇందులో మార్గం అంటే సైన్యం తన పాలకులతో విధానపరమైన ఏకీభావం కలిగివుండటం. స్వర్గం పోరాట సంసిద్ధత.మిగిలిన వన్నీ మామూలు అర్థాలే. భూమి కూడా రకరకాలుగా వుండొచ్చు. ఎత్తుపల్లాలు కొండలు లోయలూ ఏవైనా సరే. సైన్యాధిపతి ఎప్పుడూ అనుకున్న పథకాన్ని అమలు చేసేవాడై వుండాలి. దాన్ని సమయానుగుణంగా అమలు చేయాలి. యుద్ధంలో ప్రత్యర్థిని వంచించడం కూడా భాగమంటాడు సంజూ. నీ వాస్తవ పరిస్థితిని గురించి అవతలి వారికి గందరగోళం కలిగించాలి. దూరంగా వుంటే దగ్గరగా వున్నట్టు, బలహీనంగా వుంటే బలంగా వున్నట్టు బలంగా వుంటే బలహీనంగా వున్నట్టు నమ్మించాలి. సైన్యం అలసి పోకుండా చూసుకోవాలి. సంఖ్యాపరంగా సైన్యం ఎక్కువ తక్కువల కంటే మొహరింపే కీలకం. అందులోనూ సంప్రదాయ, సంప్రదాయేతర పద్ధతులను ఉపయోగించగలగాలి. శత్రువును వుచ్చులోకి లాగాలి గాని మనం వెళ్లి దానిలో చిక్కుపడిపోకూడదు. సైన్యాధిపతి వూరికే ఆగ్రహానికి అసహనానికి గురి కాకూడదు. ఇలాంటి సూత్రాలెన్నో సులభమైన శైలిలో సూటిగా వున్నాయి. పంచభూతాలనే ప్రకృతి శక్తుల్లో ఏదీ ఎప్పుడూ ఒకే విధంగా వుండదనే వాస్తవాన్ని కూడా లెక్కలోకి తీసుకోమంటాడు. గాలిలా దూసుకుపోవాలని, అడవిలా నిదానంగా వుండాలని కూడా పరస్పర విభిన్నమైన వ్యూహాలను సూచిస్తాడు. సమయస్ఫూర్తి వుంటేనే సమరస్ఫూర్తి రాణిస్తుందనేది మూల సూత్రమన్న మాట. అలాగే కదనభూమి తొమ్మిది రకాలుగా వుంటుంది. అక్కడ సైన్యం వ్యవహరించే తీరులోనూ అనేక తేడాలుంటాయి. ఇలాటి అనేక ఆసక్తికరమైన అంశాలపై 13 అధ్యాయాలతో అలవోకగా సాగే యుద్ధ తంత్రం చదివిన తర్వాత అనివార్యంగా వ్యూహాత్మకంగా మసలుకోవాలనే భావన పాఠకునిలో కలుగుతుంది. క్రాంతిమిత్ర కవితా శైలిలో రాయడం ఆకర్షణ పెంచింది.

యుద్ధతంత్రం, సన్ జూ, ఆంగ్లానువాదం: జాన్‌మిన్‌ఫర్డ్, తెలుగు అనువాదం : క్రాంతిమిత్ర, పేజీలు :112, వెల :50/-.

- తెర

సాహితీవనంలో విరిసిన కుసుమాలు

కొడవటిగంటి, మధురాంతకం, బుచ్చిబాబు, పెద్దిభొట్ల, పాలగుమ్మి, తిలక్... వీరంతా తెలుగు సాహితీవనంలో విరిసిన కుసుమాలు. తెలుగుభాషా ప్రావీణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావులు. అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగుదనాన్ని కళ్లముందు నిలిపిన సాహితీ ధన్వంతరులు. సాహితీ విలువలు భ్రష్టుపట్టిపోతున్న నేటి రోజుల్లో వీరి రచనలు ఇంకిపోతున్న అభిలాషను పునరుజ్జీవింపజేస్తాయి. చదవాలనే ఆకాంక్షను పెంపొదిస్తాయి. సాహిత్యామృతాన్ని గ్రోలాలనే ఇచ్చను రగిలిస్తాయి. పాలగుమ్మి రచనల గొప్పదనం ఏమిటీ అంటే విషయ పరిజ్ఞానం, వర్ణనాసామర్థ్యం, స్పష్టత, ప్రత్యేక శైలి. కాలాతీతం కాని కథనం. రచనల్లో గుమ్మపాలు గుప్పించగల మేధావితనం. పాలగుమ్మి శిల్పం తెలిసిన రచయిత. భిన్న వ్యక్తిత్వాలను అక్షర దర్పణంలో చూపగల సిద్ధహస్తులు. సమాజాన్ని రంగుటద్దాల్లో కాక సూటిగా చెప్పగల దిట్ట. పాలగుమ్మి ప్రజల నాడి పట్టారు. గ్రామీణ జనాల అనురాగాలు, ఆత్మీయతలు, పరిస్థితుల ప్రభావాలు, కక్షలు, కార్పణ్యాల లోతులు... అన్నింటినీ ఔపోసనపట్టి... వాటిని సున్నితంగా అక్షరాల్లో పేర్చారు. చదువరులు ఆయా నేపథ్యాలకు అనుగుణంగా పాత్రధారుల



అంతరంగాల్లోకి పయనిస్తారు. మూలాలను తడిమిన సుతిమెత్తని అనుభూతిని చవిచూస్తారు. గుండె గొంతుకలో కొట్టుకులాడిన ఉద్వేగం పాఠకుల వంతు. పాలగుమ్మి పద్మరాజు 2, 3 సంపుటాల్లో దేని ప్రత్యేకత దానిదే! రెండవ సంపుటంలో 'రెండవ అశోకుడి మూణ్ణాళ్ల పాలన' నవల నాటి రాజకీయ పరిస్థితులను అద్దంపట్టిన వ్యంగ్య రచన. నేటికీ సరిపోల్చదగిన సునిశిత హాస్యం ఆసక్తిదాయకంగా ఉంటుంది. 'రామరాజ్యానికి రహదారి' నవలది స్వాతంత్ర్య నేపథ్యం. స్వగతాల ద్వారా భిన్న పంథాలో సాగిపోతుంది. 'నల్లరేగడి' పూర్తి గ్రామీణ మాధ్యమ నవల. భూస్వామ్యుల అస్తిత్వ పోరాటాలు, దానికి బలయ్యే అమాయక గ్రామ ప్రజల ఇక్కట్లు కళ్లకు కట్టిన నవల. ఇక మూడో సంపుటంలో 'బ్రతికిన కాలేజీ' సరదా సరదాగా సాగిపోతుంది. 'చచ్చి సాధించాడు' ఉత్కంఠకు గురిచేస్తే... 'భక్త శబరి' మరొక్కమారు అవ్యాజమైన భక్తిని కళ్లముందు నిలుపుతుంది. డి. హెచ్. లారెన్స్ మూలాన్ని తీసుకుని రచించిన 'చచ్చిపోయిన మనిషి' నవల విభిన్న అనుభూతికి గురిచేస్తుంది. అణగారిపోతున్న పఠనాశక్తి తిరిగి పెల్లుబకాలంటే ఇలాంటి ఆణిముత్యాలను ఏరుకోవడం ఎంతో అవసరం. సమాజాభివృద్ధికి శుభసూచకం.

పాలగుమ్మి పద్మరాజు రచనలు సంపుటం 2, పేజీలు: 391, వెల: 180/-. సంపుటం3, పేజీలు: 291, వెల: 150/-, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని బ్రాంచీలు.

- కె.అరుణ

చూద్దామా

వాటికన్ సిటీ

రోమ్ రమ్మంటోంది...

ఆ నగరం నిండా ఎన్నో రాజప్రాసాదాలు, అద్భుతమైన ఫౌంటెన్లు కనిపిస్తాయి. వాటిని చూస్తే కొన్ని వందల నాటి చరిత్రని తమలో దాచుకున్నట్లు అనిపిస్తాయి. పాతవి, ఇంకా పాతవి, పురాతనమైనవి...ఇలా వివిధ కాలలకు చెందిన అనేక కట్టడాలు చరిత్రను తమలో నిక్షిప్తం చేసుకుని, ఆనాటి చరిత్రకు మేమే నిదర్శనం అని చాటి చెప్తాయి. మరి ఆ నగరం ఏది? ఎక్కడ వుంది? ఆ విశేషాలేంటి? ఈ వారం చూద్దాం.

క్రీస్తు పూర్వం 6వ శతాబ్దం నుండి 'బైజాంటైను' వరకు పెరిగిన మహానగరం అది. అందుకనే 'రోమ్ నగరం ఒక్క రోజులో కట్టింది కాదు' అంటారు. అక్కడి వీధులు విశాలంగా లేవు. కానీ శుభ్రంగా అందంగా ఉన్నాయి. అప్పట్లోనే నిర్మించిన ఆ భవనాలు ఓ క్రమపద్ధతిలో కంటికింపుగా కనిపిస్తాయి. ఈ నగరాన్ని మనం రోమ్ అంటాం కానీ రోమన్లు దీన్ని రోమా అని పిలుస్తారు.

ఇక్కడ ఏది చూడాలనుకున్నా 'అయ్యో... అది ముందు చూస్తే బాగుండేదేమో కదా!' అనిపిస్తుంది. అలా ఒకదానికి మించి ఒకటి అద్భుతమైన కట్టడాలు కనిపిస్తాయక్కడ.

రోమ్ నగరంలోని గతం, వర్తమానం, భవిష్యత్తు ఒకదానితో ఒకటి ఇమిడిపోయి వుంటాయి. వాటిలో ఏ ఒక్కదాన్నీ విడివిడిగా చూడలేం.

ఇక్కడకొచ్చిన పర్యాటకులు ఎవరైనా సరే 'టైమ్ ఎలివేటర్' ని చూడకుండా వెళ్లరు. వెళ్లలేరు. దీనిలో రోమ్ నగర పుట్టుపూర్వోత్తరాలు, సామ్రాజ్య స్థాపన, యుద్ధాలు.... ఇలా గత చరిత్ర మొత్తం మన కళ్ల ముందే జరిగినట్లు... కాదు కాదు ఆ సంఘటనలు జరుగుతున్నప్పుడు మనం అక్కడే ఉన్నట్లు అనిపిస్తుంది. షేక్స్పియర్ రచించిన జూలియస్ సీజర్, ఆంటోనీ, క్లియోపాత్ర నాటకాలలోని సన్నివేశాలు చూసి భయాందోళనలకు గురికానివారు ఉండరు. క్రీస్తు శకం 141 కి చెందిన 'ద టెంపుల్ ఆఫ్ ఆంటోనియన్ అండ్ ఫాస్టినా' అక్కడ చూడాల్సిన వాటిలో ఒకటి.

'ఫౌంటెన్ ఆఫ్ ట్రివి'లో ఓ భాగం...

ఈ ప్రాంతానికి ఈజిప్టు రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. అప్పట్లో అన్ని వందల కిలోమీటర్ల దూరం గుర్రాలు, రథాలమీద ఎలా వెళ్లారా అనిపిస్తుంది.

ఇక్కడ తప్పకుండా చూడాల్సిన మరో ప్రదేశం 'ఫౌంటెన్ ఆఫ్ ట్రివి'. నెప్ట్యూన్ అనే సముద్ర దేవుడు ఆల్చిప్ప ఆకారంలోని రథం మీద కూర్చుని ఉంటాడు. సముద్రపు గుర్రాలు ఆ రథాన్ని లాగుతుంటాయి. సింహం వంటి జంతువుల నోట్లో నుండి నీళ్లు ప్రవహిస్తుంటాయి. ఇక్కడొక చిత్రమైన నమ్మకం కూడా ఉంది. అదేమంటే ఈ నీటిలో నాణెమేస్తే మళ్లీ రోమ్ నగరాన్ని దర్శించే అవకాశం వస్తుందట. అందుకేనేమో ఈ కొలను నిండా నాణేలు కనిపిస్తాయి.

క్రీస్తు శకం 72 లో కట్టిన కొలీషియం మరో గొప్ప కట్టడం, ఇది వలయాకారలో ఉంటుంది. దీనిలోని ఇటుకలు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఈ కట్టడంలో ఒకేసారి 55 వేలమంది కూర్చోవచ్చు. పూర్వం ఇక్కడ ఓ వికృతమైన ఆట ఆడేవారట. అదేమంటే క్రీడాస్థలం చుట్టూ మొదటి వరుసలో ప్రభువులు, వారి బంధుగణం, తర్వాత మంత్రులు, వారి


ద ఆర్చ్ ఆఫ్ కాన్స్టాంటిన్


సెయింట్ పీటర్స్ కాథడ్రిల్ చర్చి డోమ్



సిస్టైన్ చాపెల్ లోపలి భాగం



ద టెంపుల్ ఆఫ్ ఆంటోనియన్ అండ్ ఫాస్టీనా

బంధుగణం, చివరిగా సామాన్యులు కూర్చునేవారట. అంటే వారి స్థాయిలను బట్టి వరుసగా కూర్చునేవారన్నమాట. ఆ స్థలం మధ్యలో గ్లాడియేటర్లను (బానిసలు, ఖైదీలు, నేరస్తులు) నిల్చోబెట్టి వాళ్ల మీదకి పులులు, సింహాలను వదిలేవారట. ఆ క్రూర జంతువులతో పోరాడలేక వాళ్లు బలైపోయేవారు. ఇంత వికృతమైన క్రీడని మహదానందంగా చప్పట్లు కొడుతూ మరీ చూసేవారు ఆనాటి రాజులు.

ద ఆర్చ్ ఆఫ్ కాన్‌స్టాంటిన్

కొలీషియం పక్కన క్రీ.శ 31లో చక్రవర్తి కాన్‌స్టాంటినోపుల్ నిర్మించిన విజయతోరణం 'ద ఆర్చ్ ఆఫ్ కాన్‌స్టాంటిన్' ఉంది. దీన్ని రోమన్ చక్రవర్తి క్రిస్టియానిటీలో చేరినప్పుడు కట్టించాడట. దానికి కొంత దూరంలో క్రీస్తు పూర్వం రోమన్లు పూజించిన జుపిటర్ దేవుళ్ల ఆలయాలు ఉన్నాయి. వీటినే పాగన్ దేవాలయాలు అని పిలుస్తున్నారు. వీటన్నింటినీ రోమన్ అనే చక్రవర్తి కట్టించాడు. ఇన్ని కట్టడాలున్న నగర నిర్మాణాన్ని ఆయన చేపట్టాడు. అందుకే దీన్ని రోమ్ అని పిలుస్తున్నారు.

శిల్పకళా వాటికన్

ప్రపంచంలోని క్రైస్తవులందరికీ ఆధ్యాత్మిక కేంద్రం వాటికన్ సిటీ. ఇది క్రైస్తవమతానికి సంబంధించిన శిల్పాలకు, చిత్రలేఖనానికి పెట్టింది పేరు. వాటికి సంబంధించి ఇక్కడ అనేక ప్రదర్శనశాలలున్నాయి. అందుకే సింహ ద్వారం మీద 'మూసై వాటికాన' అని రాసివుంటుంది. మూసై వాటికానా అంటే ప్రదర్శన శాలల సమూహమని అర్థం. ఇక్కడ చాలా చర్చిలు ఉన్నా, అన్నింటికన్నా ఎక్కువగా ఆకర్షించేది సెయింట్ పీటర్స్ కాథడ్రిల్ చర్చి. దీన్ని నిర్మించడానికి 150 సంవత్సరాలు పట్టిందట. దీని పైకి ఎక్కడానికి 530 మెట్లు ఉన్నాయి. మెట్లు ఎక్కలేని వారికి లిఫ్ట్ కూడా ఉందండోయ్. ఇక రోమ్ నగరంలో ఏ మూలనుండి చూసినా ఈ చర్చి కనిపిస్తుంది.

దీని డోమ్ విషయానికి వస్తే ప్రపంచంలోనే ఈ డోమ్ అతి పెద్దదట. పై గోళంలో ఎనిమిది పెద్ద పెద్ద ఆర్చీలున్నాయి. ప్రతి ఆర్చిలోనూ పెద్ద పెద్ద కిటికీలు, వాటిపై పూలు, లతలు ఉన్నాయి. ఒక్కో కిటికీ సైజు మనకు పల్లెటూర్లలోని పెద్ద పెద్ద ఇళ్లలో ముఖద్వారం కంటే పెద్దగా ఉంటుంది. నేలమీద రంగు రంగు పాలరాళ్లు పరిచి ఉంటాయి. వాటిని చూసి పాలరాళ్లలో అన్ని రంగులుంటాయా అని ఆశ్చర్యపోతాం. అక్కడ ఎటువైపు చూసినా పాలరాతి శిల్పాలు, తైల వర్ణ చిత్రాలే కనిపిస్తాయి. వీటన్నింటిలో ఒక్కటి అందర్నీ బాగా ఆకర్షిస్తుంది. ఆ శిల్పం మైఖలేంజిలో చెక్కిన విగతజీవుడైన క్రీస్తుని మేరీమాత తన ఒడిలో పడుకోబెట్టుకుని దుఃఖిస్తూ ఉంటుంది.

కాథడ్రిల్ ముఖద్వారం ముందు అర్ధచంద్రాకారంలో పెద్ద ఆవరణ ఉంటుంది. దీని ఎత్తు 238 అడుగులు. దీన్లో నాలుగు వరుసల్లో భారీ సైజు స్థంబాలున్నాయి. ఒక్కోదాని వైశాల్యం ఎంతుంటుందంటే ఇద్దరు మనుషులు దీని చుట్టూ తమ రెండు చేతులు చాపి పట్టుకోవాలన్నా అందవు. అంత పెద్దగా ఉంటుంది. వీటి పైభాగాన క్రైస్తవ సెయింట్ విగ్రహాలు అమర్చారు. ఆవరణ మధ్య భాగంలో ఫౌంటెన్లు చాలా అందంగా కనిపిస్తాయి. ఈ ప్రదేశంలోనే మదర్ థెరిస్సా బీటిఫికేషన్ సెరిమనీ జరిగింది. లక్షలాది ప్రజల ముందు ఈ విషయాన్ని సెయింట్ పోపు ప్రకటించాడు. ప్రతి సంవత్సరం పోపు ఈ ప్రదేశం నుండే క్రిస్మస్ సందేశాన్ని ఇస్తాడు.

రాఫేల్, బెర్నిని, మైఖలేజింలో వంటి గొప్ప గొప్ప కళాకారులు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించి నిర్మించిన మ్యూజియాలు అనేకం ఇక్కడే ఉన్నాయి. ఈ మ్యూజియాలన్నింటిలో సిస్టైన్ చాపెల్ బాగా ఆకర్షిస్తుంది. దీన్ని మైఖలేంజిలో నిర్మించాడు. గోడలు, పై కప్పు... దేన్నీ వదలకుండా ప్రతిచోటా బైబిల్లోని పురాణగాథలతో నింపేశారు. మెసెస్ చరిత్ర, క్రీస్తు జననం... ఇలా ఎన్నో ఉన్నాయి. క్రీస్తు మరణానికి ముందు భోజనానికి సంబంధించిన 'ద లాస్ట్ సప్పర్' చిత్రాలు తొమ్మిది ఇక్కడ కనిపిస్తాయి. దీనిలో ప్రతి దానిచుట్టూ మరో తొమ్మిది చిన్న పెయింటింగులు ఉంటాయి. వాటిలో ప్రతి చిత్రమూ ఓ కళాఖండమే. మైఖలేంజిలో తనకు పూర్తి స్వేచ్ఛనిస్తే గానీ చిత్రాలు గీయలేనని అప్పటి రోమన్ చక్రవర్తితో చెప్పాడట. దానికి ఆ చక్రవర్తి కూడా సరేనన్నాడట. అంత స్వేచ్ఛా స్వతంత్రాలతో వేయబట్టే అవి అంత [illegible] వచ్చాయేమో.

★



కొలీషియం



జుపిటర్ ఆలయం

జీవన 'యానాం'

ఒక పక్క సముద్రం, మరోపక్క గోదావరి ప్రవాహం... మధ్య విస్తారమైన కొబ్బరి చెట్లు, పచ్చదనం... ఆ పచ్చదనపు పందిట్లో చూడచక్కని బొమ్మరిల్లులా ఉంటుంది యానాం. ఉండటానికి తూర్పు గోదావరి సందిట్లో చంటిపాపలా కనిపిస్తుంది. కానీ, వాస్తవానికి అది ప్రత్యేక 'పోషణ', 'పాలన' ఉన్న పట్టణం. గోదావరి బంధుత్వం, సాంప్రదాయతత్వం పుష్కలంగా కలగలిసిన ఊరే కానీ, చారిత్రాత్మకంగా దాని తీరు వేరు! ఒకప్పటి వలస పాలన నుంచి నేటి కేంద్ర పాలిత పాలన దాకా ... యానాందొక విలక్షణ ప్రస్థానం! దాని అడుగుజాడల అవలోకనమే ఈ అక్షర యానం!

-సత్యాజీ

ఎక్కడుంది యానాం? ఈ ప్రశ్నకు చాలామంది టక్కుమని చెప్పే సమాధానం తూర్పు గోదావరి జిల్లాలోనని! అది కొంత నిజం.. కొంత అబద్ధం. భౌగోళికంగా చూస్తే- యానాం తూర్పు గోదావరి జిల్లాలో ఉంది. అన్ని పక్కలా సరిహద్దులు ఈ జిల్లాకు చెందినవే! గోదావరి, కోరింగ నదుల మధ్య ఒదిగింది యానాం. కోరింగ నది ఈ పట్టణాన్ని రెండు భాగాలుగా విభజించింది. పశ్చిమం వైపు యానాం, కనకాల దిబ్బ, మెట్టకూరు; తూర్పు వైపు కురసాంపేట, ఫరంపేట, దరియాల తిప్ప, గిరియాంపేట, సావిత్రీనగర్ ఉన్నాయి. ఇవన్నీ యానాం పురపాలకసంఘం, నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. యానాంకు 30 కిలోమీటర్ల దూరంలో కాకినాడ ఉంది. అక్కడినుంచి బోలెడన్ని బస్సులూ, ఇతర రవాణా సౌకర్యాలూ ఉన్నాయి. యానాం రోజువారీ వ్యవహారాలూ, చుట్టరికాలూ ఈ జిల్లాతోనే ముడిపడి సాగుతాయి. కానీ, పాలనాపరంగా అది పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం పరిధిలోకి వస్తుంది. యానాం ప్రజలు తమ రాజధాని పుదుచ్చేరికి వెళ్లాలంటే రెండ్రోజులపాటు ప్రయాణం చేయాలి. 850 కిలోమీటర్లు దాటాలి. అక్కడ వ్యవహారాలు చక్కబెట్టాలంటే తమిళ భాష తెలిసి ఉండాలి! ఇక్కడి జనానికి తమిళనాడు ఆవల వైపు ఉన్న పుదుచ్చేరితో సంబంధం ఏమిటి? అనిపిస్తుంది కదూ? ఆ సంగతి తెలియాలంటే మనం చరిత్రలోకి వెళ్లి తీరాలి.

ఫ్రెంచి పాలనలో రెండు శతాబ్దాలు

యానాం తొలుత విజయనగరం రాజుల ఏలుబడిలో ఉండేదట! బొబ్బిలియుద్ధంలో విజయనగరం రాజుకు ఫ్రెంచివాళ్లు ఆయుధ సహాయం చేసినందున, వారికి దీనిని బహుమతిగా ఇచ్చారట! సముద్రం ఛీదుగా రాకపోకలు సాగించేందుకు ఫ్రెంచివారు దానిని మంచి స్థావరంగా భావించారు. 1723 నాటికి యానాం వారి వశం అయింది. అప్పట్లో ఫ్రెంచివాళ్లకున్న ఐదు స్థావరాల్లో యానాం ఒకటి. మిగిలిన స్థావరాల్లో చంద్రనాగూర్ (పశ్చిమ బెంగాల్) 1673లో, పాండిచ్చేరి (ఇప్పటి పుదుచ్చేరి) 1674లో, మహే 1725లో, కారైకాల్ 1739లో వారి స్వాధీనంలోకి వెళ్లాయి. తరువాతి కాలంలో బ్రిటీషు - ఫ్రెంచి వర్తక సంఘాల ఆధిపత్య పోరాటంలో అన్ని స్థావరాలు మాదిరిగానే యానాం కూడా మూడు సార్లు బ్రిటీషువాళ్ల చేతిలోకి వెళ్లొచ్చి, ఆఖరిదాకా ఫ్రెంచివాళ్ల ఆధీనంలోనే ఉంది. దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ- ఇక్కడ మాత్రం 1954 వరకూ వాళ్ల ఏలుబడే సాగింది. గోదావరి, కోరంగి నదులను వారు రవాణాకు ఉపయోగించారు. ఉప్పు పండించే ప్రాంతాలకు యానాం ముఖ్యకేంద్రంగా మారింది. బట్టలు, కలప వ్యాపారాలపై ఫ్రెంచి పాలకులు ఎక్కువగా కేంద్రీకరించేవారు. వ్యాపారంలో భాగంగా ఇక్కడినుంచి కూలీలను ఇతర దేశాలకు పంపేవారు. ఆ కాలంలోనే ఉత్తరాంధ్ర, గోదావరి ప్రాంతాలనుంచి వచ్చి అనేకమంది యానాంలో స్థిరపడ్డారు.

తరువాతి కాలంలో స్థానిక పాలనపై కేంద్రీకరించారు. 1880లో యానాం పురపాలకసంఘం ఏర్పడింది. ఉన్నతాధికారులుగా ఫ్రెంచి జాతీయులు ఉంటూనే, స్థానిక ప్రజాప్రతినిధులకు పాలనలో భాగస్వామ్యం కల్పించారు. యానాంలో కొన్నాళ్లు బ్రిటీషు పాలన కూడా సాగింది. దీంతో, ప్రజలు రెండు పాలనలనూ బేరీజు వేసుకొని, ఫ్రెంచి పాలన బాగుందనే అభిప్రాయంతో ఉండేవారు. ఫ్రెంచి పాలకులకు పాండిచ్చేరి ముఖ్య కేంద్రం. భౌగోళికంగా చూస్తే... యానాం అక్కడికి చాలా దూరం, మారుమూల. దీంతో, పాండిచ్చేరిపై ఉన్నంత ఫ్రెంచి పాలనా ముద్ర ఇక్కడ కనిపించదు. ఆ కాలంలో అభివృద్ధి కూడా నామమాత్రంగానే సాగింది.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో సందిగ్ధావస్థ

1920 నాటికి దేశమంతా స్వాతంత్ర్య కాంక్షతో రగిలిపోతుంటే- ఈ ఫ్రెంచి స్థావరాల్లో అలాంటి అలికిడే

యానాం ప్రభుత్వ అతిథి గృహం



బాలయోగి వారధి

లేదు. పక్క గ్రామాల ప్రజలతో నిత్య సంబంధాలు కొనసాగుతున్నా... జాతీయోద్యమ ప్రభావం సోకలేదు. బ్రిటీషు పాలకుల నిర్ణయాలు, నిరంకుశాల ప్రభావం ఇక్కడ లేకపోవడం ఒక కారణం. నిరక్షరాస్యత, వెనకబాటుతనం మరొక కారణం. దేశమంతా ఒక్క గొంతున వందేమాతరం నినదిస్తుంటే– ఫ్రెంచి కాలనీల్లోని జనం ఉదాశీనంగా ఉండి పోయారు! అక్కడక్కడ కొంతమంది విద్యావంతుల్లో అలాంటి జాతీయ భావాలు వెల్లివిరిసినా– మార్గదర్శకత్వం లభించలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, ఏడేళ్లు గడిసాయి. స్వేచ్ఛా భారతం సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించి, సొంత నడక ప్రారంభించింది. ఆ తరుణంలో యానాం, ఇతర ఫ్రెంచి స్థావరాల్లో పరాయి పాలన నుంచి విముక్తి పొందాలనే అభిలాష మొదలైంది! పక్క ప్రాంతాలనుంచి, భారత ప్రభుత్వం నుంచీ తోడ్పాటు, మార్గనిర్దేశనం అందడం ఆరంభమైంది. ఫ్రెంచి పాలకులు 'విభజించు– పాలించు' పద్ధతుల్లో అణచివేత ప్రారంభించారు. కొంతమందిని చేరదీసి, తమకు అనుకూలంగా మార్చుకున్నారు. వారితో, 'ఫ్రెంచి పాలనే మంచి పాలన' అని ప్రచారం చేయించారు. సమావేశాలు పెట్టించారు. పాటలు రాయించారు, పాడించారు.

తల్లి ఇచ్చిన పాలు తనివి తీరగ తాగి
తల్లి రొమ్మే గుద్దుతావా, పలుగాకీ
పాపభీతి ఇసుమంతయు లేదా?
నిన్నమొన్నటిదాకా నీవనుభవించినది
ఫ్రెంచివారల సొమ్ము కాదా?– అని పాటలు హోరెత్తాయి.

యానాంలోని కొంతమంది పెద్దలు ఫ్రెంచి పాలకులకు మద్దతుగా నిలబడ్డారు. కాకినాడ తదితర ప్రాంతాలనుంచి సంఘీభావం ప్రకటిస్తున్న విలీనోద్యమ నాయకులపై విరుచుకుపడ్డారు. అయినా, ఉద్యమం ఆగలేదు. బెదరలేదు. ఏ పరిణామానికీ భయపడలేదు. సందిగ్ధావస్థలో ఉన్న చాలామంది సామాన్యులు నెమ్మది నెమ్మదిగా నిజాలను గ్రహించారు. ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

విలీనోద్యమం.. విజయోత్సాహం

ఫ్రెంచి ప్రభుత్వంలో అధికారిగా పనిచేసిన దడాల రమణయ్య తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఉద్యమంలో పాల్గొన్నారు. పాండిచ్చేరిలో అప్పటికే సాగుతున్న ఉద్యమాన్ని స్ఫూర్తిదాయకంగా ప్రజలకు వివరించారు. యానాం మున్సిపాలిటీకి ప్రాతినిథ్యం వహిస్తున్న మద్దింశెట్టి సత్యానందం, కనకాల తాతయ్య, కామిశెట్టి పరశురామ వరప్రసాదరావు నాయుడు, యర్రా సత్యనారాయణ మూర్తి తదితరులు ఉద్యమంలోకి దూకారు. విలీన ఆకాంక్ష రోజురోజుకూ బలపడడంతో– ఫ్రెంచి పాలకులు వెర్రెత్తిపోయారు. సభలపైనా, జనసమీకరణలపైనా లాఠీలు ఝుళిపించారు. కాల్పులు జరిపారు. పెద్ద సంఖ్యలో గూండాలను రంగంలోకి దించి, ఉద్యమకారులపై దాడులు చేయించారు. అదే సమయంలో పాండిచ్చేరికి చెందిన శివారు గ్రామాలు భారత యూనియన్లో విలీనమయ్యాయనే వార్తలు ఉద్యమానికి ఉత్తేజం కలిగించాయి.

1954 జూన్ 12న కొంతమంది ఫ్రెంచి ప్రేరేపిత గూండాలు భారత భూభాగంలో ఉన్న ఒక ఉద్యమ శిబిరంపై కాల్పులు జరిపారు. ఇద్దరు ఉద్యమ కారులను, ఇద్దరు భారతీయ పోలీసులను గాయపరిచారు. ఈ సంఘటన ఉద్యమకారుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు రగిల్చింది. ఎలాగైనా యానాంలోకి ప్రవేశించి, అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనే నిర్ణయానికి కారణమైంది.

ఆ మరుసటిరోజున... వేలాదిమంది ఉద్యమకారులు జాతీయ పతాకాలు చేతపట్టి... యానాంలోకి ప్రవేశించారు. ఫ్రెంచి పాలకులు, వారి గూండాలూ, పోలీసులూ ఆటంకాలు కల్పించినా ఎక్కడా వెనకంజ వేయలేదు. నినాదాలు చేస్తూ వీధుల్లో కవాతు చేశారు. ఎక్కడా ప్రతిఘటన ఎదురు కాలేదు. ఫ్రెంచి పాలన సమర్థించిన పెద్దలు భయంతో దాక్కోవడమో, పారిపోవడమో చేశారు. ఉద్యమకారులు రెట్టించిన ఉత్సాహంతో పరిపాలనా భవనంపైనుంచి ఫ్రెంచి జాతీయపతాకను దించివేసి, మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. అదొక ఒక చారిత్రాత్మక సన్నివేశం.

జాతీయ చిహ్నాలు

తరువాత భారత, ఫ్రెంచి ప్రభుత్వాల మధ్య చర్చలూ ఒప్పందమూ జరిగాయి. 1954 నవంబరు 1వ తేదీన ఫ్రెంచి ప్రభుత్వం– పాండిచ్చేరి, కారైకల్, మహే, యానాంలను భారత ప్రభుత్వానికి అప్పగించింది. భారత ప్రభుత్వం 14వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ ప్రాంతాలన్నింటినీ కలిపి– పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించింది. ఇది 1962 ఆగస్టు 16 నుంచి అమల్లోకి వచ్చింది. అందుకనే పాండిచ్చేరి ప్రజలు ఏటా ఆగస్టు 16న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. ఫ్రెంచి స్థావరంగా ఉన్న చంద్ర నాగూర్

కమ్యూనిస్టుల కృషి కారణంగా 1951లోనే భారత యూనియన్లో విలీనమైంది.

ఆ జ్ఞాపకాలు కొన్ని.. గురుతులు ఇంకొన్ని...

రెండొందల ఏళ్ల పాటు ఏలుబడి సాగించిన ఫ్రెంచి వలస పాలకుల గురుతులు యానాంలో ఇప్పటికీ ఉన్నాయి. ఇక్కడ చాలా పురాతనమైన రోమన్ కేథలిక్ చర్చి ఉంది. ఫ్రాన్సు నుంచి రప్పించిన కలప, అలంకార సామగ్రితో దీనిని ఆకర్షణీయంగా నిర్మించారు. పూర్తి ఫ్రెంచి శైలిలో నిర్మించిన ఈ చర్చి సందర్శకులను ఆకట్టుకుంటుంది. 1848లో అప్పటి ఫ్రెంచి పాలనాధికారి లాదే క్లేపరినన్ సహాయంతో షేక్ జాన్ మహమ్మద్ మసీదును నిర్మించారు. 1946, 1999లలో దానినే పునఃనిర్మించారు. ఫ్రెంచివారు ప్రత్యేకంగా నిర్మించుకున్న సమాధులు గత చరిత్ర ఆనవాళ్లుగా ఉన్నాయి. ఫ్రాన్సునుంచి అప్పుడప్పుడు వచ్చే సందర్శకులు వాటిని ప్రత్యేకంగా తిలకిస్తారు.

ఫ్రాన్సు పౌరసత్వం పొందిన కొంతమంది ఉద్యోగ విరమణ అనంతరం యానాంలో నివసిస్తున్నారు. వారు పొందే పింఛను మన రూపాయల్లో చూస్తే... 60 వేల నుంచి లక్ష పైదాకా ఉంటుంది. పుదుచ్చేరి మొత్తంగా పదివేల మంది, యానాంలో రెండు వేల మంది ఫ్రాన్సు పౌరసత్వం గల వాళ్లు ఉన్నారని అంచనా. వీరు ఫ్రాన్సు జాతీయ ఎన్నికల్లో ఓటు వేస్తారు. యానాంకు చెందిన దాదాపు వంద కుటుంబాలు ఫ్రాన్సులో శాశ్వత నివాసం ఏర్పర్చుకున్నాయి.

అప్పటి ఒప్పందం ప్రకారం... యానాంలో నివసిస్తున్నవారు కావాలనుకుంటే ఫ్రెంచి పౌరసత్వం తీసుకోవచ్చు. ఇది 1964 వరకూ అమల్లో ఉంది. ఇక్కడి ఫ్రెంచి పౌరులు ఏటా జులై 14న వారి జాతీయ దినోత్సవం జరుపుకుంటారు. ఫ్రెంచి పౌరుల వ్యవహారాలు చూట్టానికి పాండిచ్చేరిలో కాన్సులేట్ కార్యాలయం ఉంది. వలస పాలన ముగిసి ఇన్నేళ్లు గడిచినా- ఇవన్నీ ఆనాటి గురుతులే!

బదిలీ అయితే... రాష్ట్రాలు దాటాలి!

యానాంలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అంటే భయమే! ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బదిలీ చేస్తే- రెండు మూడు రాష్ట్రాలు దాటి వెళ్లాల్సి ఉంటుంది. యానాం నుంచి పాండిచ్చేరి వెళ్లాలంటే- ఆంధ్రప్రదేశ్, తమిళనాడు దాటాలి. మహేకి వెళ్లాలంటే ఈ రాష్ట్రాలతో పాటు కేరళ కూడా దాటాలి. ఇది చాలా వైవిధ్యభరితమైన అనుభవం. ఇక్కడ బంగాళాఖాతాన్ని తాకిన వారు మహే వెళితే- అరేబియా సముద్రాన్ని చూడవచ్చు! తెలుగు, తమిళం, మళయాళ భాషల్లో ఎంతోకొంత ప్రవేశం ఉంటే తప్ప ఉద్యోగం చేయటం కష్టమే! సొంత ప్రాంతం తపన వల్ల ఇతర ప్రాంతాలనుంచి యానాం వచ్చిన ఉద్యోగులు ఇక్కడ ఎక్కువ కాలం ఉండరు. ఏడాదిలోపే వెనక్కి వెళ్లిపోవటానికి ప్రయత్నిస్తారు. ఇక్కడి వారు ఇతర ప్రాంతాలకు బదిలీ అయినా అంతే! ఉన్నత స్థానాల్లో ఉన్న వారు మాత్రం ఏళ్ల తరబడి ఏ ప్రాంతంలోనైనా పనిచేస్తారు.

కంటే కూతుర్నే కను!



ఆడపిల్ల గుండెలమీది కుంపటి అన్న అనాగరిక అభిప్రాయం యానాంలో ఎక్కడా వినిపించదు. అమ్మాయే మా ఇంటి మహాలక్ష్మి అన్న సంతోషం ప్రతి ఇంటా తొణికిసలాడుతుంది. ఇక్కడి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మహిళే మూలకేంద్రం. ఇంటిస్థలం, రేషను కార్డు, రుణాలు, ఇతర సహాయాలూ... అన్నీ మహిళల పేరునే మంజూరు చేస్తారు. ఒక ఆడపిల్లతో కుటుంబ నియంత్రణ పాటిస్తే- రూ.25 వేల నగదు ప్రోత్సాహకంగా ఇస్తారు. ఇద్దరు ఆడపిల్లలతో సరిపెట్టుకుంటే- రూ.15 వేలు ఇస్తారు. చదువు మొత్తం ఉచితం. కస్తూర్బా బాలికోన్నత పాఠశాల, జవహర్ నవోదయ విద్యాలయం ... ఏ ప్రైవేటు విద్యాసంస్థకూ తీసిపోని రీతిలో చదువును అందిస్తాయి. ఏ ఇంట ఆడపిల్లకు పెళ్లయినా ప్రభుత్వం నుంచి రూ.15 వేల ఆర్థిక సహాయం, మంగళసూత్రానికి మరో రూ.5 వేలు అందిస్తారు. ఉన్నత చదువులకు వెళ్లినా- ఫీజులు వగైరా ప్రభుత్వమే భరిస్తుంది. పదో తరగతిలో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకు సాధిస్తే- అక్షరాలా రూ.లక్ష నగదు బహుమానం! గోదావరి అబ్బాయిలు యానాం అల్లుళ్లుగా రావటానికి పోటీ పడతారు కాబట్టి- సంబంధాలకోసం వెంపర్లాడక్కర్లేదు. ఆడపిల్లలు అత్తారిళ్లకు వెళ్లిపోయే అంపకాల సీన్లు ఉండవు. జీవితాంతం పిల్లాపాపలతో కళ్లెదుటే ఉంటారు.

యానాం ఇల్లరికం భలే మజా..!

ఇల్లరికంలో ఉన్న మజా యానాం అల్లుళ్లకు బాగా తెలుస్తుంది! ఎందుకంటే- ఇక్కడి అమ్మాయిల్ని పెళ్లాడినవాళ్లు ఇంకెక్కడికీ పోరు! ఇక్కడే స్థిరపడిపోతారు. కారణం ఏమిటని అడిగితే- 'అక్కడ (సమీపంలోని తూర్పు గోదావరి జిల్లా ఊళ్లు) కన్నా ఇక్కడ బాగుంటుంది' అనేస్తారు ఒక్క మాటలో!

'ఇక్కడ బతకటానికి బెంగ లేదండి... పిల్లలకు చదువు ఫ్రీ. రోజూ గుడ్డూ, పాలు, భోజనం స్కూల్లోనే. ఆడవాళ్ల పేరున ఇంటి స్థలం ఇస్తారు. కట్టుకోవటానికి లక్ష రూపాయలు ఇస్తారు. ఎర్ర కార్డు ఉంటే నెలనెలా 25 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తారు. ప్రభుత్వ పథకాలు కూడా ఇంకా శానా ఉంటాయి. చాలా వస్తువుల రేట్లు కూడా ఇక్కడ తక్కువ. ఇంకే కావాలండీ, బతకటానికి?' అన్నాడు కాకినాడ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డ ఇల్లరికం అల్లుడు సత్తిబాబు.

'భవిష్యత్తు మీద బెంగ లేదండి.. పెద్దగా ఖర్చు లేదిక్కడ. కష్టోకూస్తో సంపాదిస్తే నికరంగా పిల్లల కుంటాది.' అంది అతడి భార్య, యానాం బిడ్డ లక్ష్మి.

యానానికి సమీపంలో ఉన్న తూర్పు గోదావరి జిల్లా వాసులు చాలామంది ఇక్కడ స్థిరపడాలని భావిస్తారు. దానికి యానాం అమ్మాయిని పెళ్లాడడం ఒక్కటే సులభమైన మార్గం. అందుకనే గోదావరి అబ్బాయిలు ఇల్లరికానికి ఇష్టపడతారు. ఇలా 'వలస' వస్తున్న వాళ్ల సంఖ్య యానాంలో రోజురోజుకీ పెరుగుతోంది. 1981 వరకూ జనాభా పెరుగుదల రేటు సాధారణంగా ఉంటే- ఆ తరువాత అసాధారణంగా (50 శాతానికి పైబడి) ఉంది. 1981లో ఇక్కడి జనాభా 11,631 కాగా, 2001లో 31,362. తాజా లెక్కల ప్రకారం 50 వేలు దాటింది! (ఈ జనాభా అంతా ఇల్లరికాల వల్ల పెరిగింది కాదండోయ్! వలస వచ్చిన, వస్తున్న వాళ్ల సంఖ్య ఏటేటా పెరుగుతోంది)



యానాం ఆధునిక ప్రస్థానం

పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలోని అన్ని పట్టణాలకన్నా యానామే చాలాకాలం వరకూ వెనకబాటుకు గురైంది. ముఖ్య పట్టణం ఇక్కడికి చాలా దూరంలో ఉండడంవల్ల ఇక్కడి అభివృద్ధిపై ఎక్కువ కేంద్రీకరించలేదు. 1996లో మల్లాడి కృష్ణారావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక- ఈ పరిస్థితిలో మార్పొచ్చింది. అటు పాండిచ్చేరి నుంచి, ఇటు కేంద్రం నుంచి నిధులు రప్పించటానికి శాయశక్తులా కృషి చేశారు. యానాంకు ఆధునిక రూపం ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రజలకు ఆదాయాలు, ఉపాధీ పెరగటానికి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. రీజెన్సీ సిరామిక్స్, రెడ్డీ ల్యాబ్స్, సోమెకాన్, స్ట్రాబోర్డు, సుచిత్రా కాంపోనెంట్స్ వంటి పరిశ్రమలు ఇక్కడ నెలకొన్నాయి.

ఇప్పుడు యానాం క్రమేణా పర్యాటక శోభను సంతరించుకుంటోంది. గోదావరి తీరం ఇప్పుడు అందాల కొలువుగా మారింది. పచ్చదనం పొదువుకొని, సరికొత్త నిర్మాణాలతో కనుల పండగ చేస్తోంది. ఎత్తయిన భరతమాత విగ్రహం, శివలింగాన్ని అభిషేకిస్తున్న ఏనుగుల ద్వయం, అంబరాన్ని తాకేలా ఉన్న ఏసుక్రీస్తు విగ్రహం... తీరానికి కొత్త వెలుగులు అందాయి. యానాం – వెదుర్లంక మధ్య బాలయోగి వారధి అన్నింటికీ మించిన ఆభరణం. ఈ బ్రిడ్జి నిర్మించాక కోనసీమకు రాకపోకలు సులభమయ్యాయి. బాహ్య ప్రపంచంతో సమాచార, రవాణా సంబంధ వ్యవస్థలు మరింత మెరుగుపడ్డాయి. ఈఫిల్ టవర్ నమూనాలో చేపట్టిన యానాం టవరు నిర్మాణం ఇంకా పూర్తి కావల్సి ఉంది. దీని ఎత్తు 300 అడుగులు కాగా, నిర్మాణ వ్యయం రూ.45 కోట్లు! ఈ టవరు నిర్మాణం పూర్తయితే- యానాంకొక ప్రత్యేక ఆకర్షణ అవుతుంది. ప్రభుత్వ రంగంలో నిర్మించిన షీగల్ రెస్టారెంటు, దానికి ఆనుకొని ఉన్న బోటు క్లబ్బు పర్యాటకులకు పసందైన విందునూ, ప్రకృతి అందాల విందునూ అందిస్తాయి.

ఆధునిక నిర్మాణాల అవసరం లేకుండానే యానాం సహజసిద్ధమైన అందాల తీరం. అటు బంగాళాఖాతం, ఇటు గోదావరీ... ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయి. కనుచూపు మేరా పచ్చదనం, కొబ్బరిచెట్ల హరిత ఛత్రం సందర్శకులను అలరిస్తాయి. తన్మయత్వానికి లోను చేస్తాయి. వీటిని నిత్యం పరిరక్షించటం ద్వారా, మరిన్ని హంగులూ, సదుపాయాలూ సమకూర్చటం ద్వారా చారిత్రిక యానాం మరింత శోభాయమానం అవుతుందనటంలో సందేహం లేదు! ★

అతి పురాతన చర్చి

సందళ్లూ ... సంబరాలూ...

అనేక కులాలూ, మతాలకు సంబంధించిన ప్రజలు మొదటినుంచి ఇక్కడ కలిసిమెలసి జీవించారు. ఎవరి సంస్కృతీ సంప్రదాయాలను వారు పాటిస్తూనే- సమైక్య జీవనం సాగించారు. ఇక్కడ అన్ని మతాల వారి పండగలూ ఉత్సవాలూ ఘనంగా జరుగుతాయి. వెంకన్నబాబు రథయాత్ర ప్రత్యేక ఆకర్షణగా సాగుతోంది. తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలోనే ఇక్కడా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అన్ని సామాజిక తరగతుల వారికీ ప్రాతినిధ్యం కల్పిస్తూ- వీటిని జరుపుతారు. 16 ఏళ్ల నుంచి ఇక్కడ నిర్వహిస్తున్న ప్రజా ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. ఏటా జనవరిలో అత్యంత వైభవంగా జరుపుతారు. వందలాదిమంది ప్రముఖ కళాకారులు ఇందులో పాల్గొంటారు.

'సంక్షేమం' సగం బలం!

ఉన్నంతలో యానాంలో జీవన ప్రమాణాలు నాణ్యంగా ఉంటాయి. బతకగలమన్న భరోసా ప్రతి ఒక్కరిలోనూ వ్యక్తమవుతుంది. గృహ విద్యుత్ యూనిట్ ధర 90 పైసలే! సుంకాల్లో తేడా వల్ల పెట్రోలు ధర కూడా ఆంధ్రప్రదేశ్ కన్నా సుమారు రూ.6లు తక్కువగా ఉంటుంది. నిత్యావసర ధరలు అన్నింటిలోనూ ఈ వ్యత్యాసం ఎంతోకొంత కనిపిస్తుంది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందుతుంది. వికలాంగులకు నెలనెలా రూ.1500లు ఇస్తారు. ఉచితంగా 25 కిలోల బియ్యం అందిస్తారు. ఇంకా ఇలాంటి అనేక పథకాలు పేదలను ఆదుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు కొద్దిపాటి వేతనం పెంచటానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. యానాంలో అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పుడు రూ.11 వేల వేతనం లభిస్తోంది. ఆయాలకు రూ.ఆరు వేలు వరకూ ఇస్తారు. ప్రభుత్వ పరిధిలోనే నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా లభిస్తాయి. ఇన్ని మేళ్లు జరుగుతున్నందువల్లనే- యానాం ఎప్పటికీ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండాలనేది ప్రజల కోరిక. పుదుచ్చేరికి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని ఎన్డీఏ ప్రభుత్వం యోచించినప్పుడు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ దేశ ప్రజలకు ఇప్పటికీ సంక్షేమ పథకాల అవసరం, ప్రభుత్వరంగం తోడ్పాటూ ఎంతైనా ఉందని చెప్పటానికి ఈ స్పందన ఒక నిదర్శనం.

కథ

వృత్తి... ప్రవృత్తి...

- కె. శ్రీనివాసశాస్త్రి

"**న**గుమోము గనలేని" అనే త్యాగరాజకృతిని కళ్యాణి పాడుతోంది. ఆమె భర్త ఆదిత్య, అత్తగారు పార్వతి, మామగారు శంకరం విని ఆనందిస్తున్నారు. ఆ గాన సరస్వతి తమ ఇంట్లో అడుగుపెట్టడమే తమ అదృష్టంగా భావించారు. ప్రతిరోజూ ఓ గంటసేపు కళ్యాణి తంబూరతో శాస్త్రీయ సంగీతం సాధన చేస్తుంది.

ఆదిత్య సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. శంకరం రిటైరయిన ప్రభుత్వోద్యోగి. సంగీతమంటే చెవికోసుకునే ఆదిత్య పెళ్ళిచూపుల్లో కళ్యాణి పాట విని పరవశించిపోయాడు. తనకామె నచ్చిందని చెప్పాడు. ఆమె పెద్ద అందగత్తె కాకపోయినా అనాకారి మాత్రం కాదు. వాళ్ల పెళ్లయి ఏడాది కావస్తోంది. అతను ఉద్యోగంలో చేరి ఏడాది దాటి పోయింది.

పెళ్లికి ముందు కళ్యాణి సంగీత కచేరీలు చేసి మంచి పేరు సంపాదించింది. సంగీత పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. బి.ఎ లో సంగీతం తన అభిమాన సబ్జెక్టుగా తీసుకుని ఫస్ట్‌క్లాసులో పాసయింది. ప్రతినెలా ఆమె కచేరీ ఏదో ఒక చోట జరుగుతూనే ఉండేది. ఒక్కొక్క కచేరీకి మూడు వేల రూపాయల పారితోషికం లభించేది.

కానీ పెళ్లయిన తర్వాత కళ్యాణి సంగీతం విషయంలో భర్త విధించిన కొన్ని ఆంక్షలను పాటించవలసి వచ్చింది. దగ్గరలో ఉన్న ఒక సంగీత కళాశాలలో టీచరుగా చేరడానికి దరఖాస్తు పెట్టింది. ఆమెకు వెంటనే పిలుపు వచ్చింది. ఇంటర్వ్యూలో సెలక్టయింది.

వెంటనే భర్త దగ్గరికి వెళ్లి "సంగీతం టీచర్‌గా చేరితే నాకు నెలకు నాలుగువేల రూపాయలు జీతం వస్తుంది. ఆ ఉద్యోగంలో చేరమంటారా?" అంది ఆశగా.

"నాకు నెలకు నలభైవేలకు పైగా వస్తుంది. నాన్నగారి పింఛను ఆరువేలు వస్తుంది. నువ్వు ఉద్యోగం చేసి సంపాదించాల్సిన అవసరం ఏముంది? అయినా ఆ ఉద్యోగంలో ఉండే బరువు బాధ్యతలు నువ్వు మోయడం నాకిష్టం లేదు" అన్నాడు ఆదిత్య. ఈ మాటలు ఆమెను నిరాశపరిచాయి.

సంగీత కచేరీలలో కళ్యాణికి ఉన్న మంచి పేరు కారణంగా ఆమెకు విశాఖపట్నం నుండి కచేరీకి పిలుపు వచ్చింది. ఆమె భర్తతో "విశాఖపట్నంలో సంగీత కచేరి చేయమని అడుగుతున్నారు. ఐదు వేలు పారితోషికం ఇచ్చి రానుబోను ప్రయాణపు ఖర్చులు వాళ్లే భరిస్తారట. కచేరీ చేయడానికి వెళ్లమంటారా?" అంది. "హైదరాబాద్ నుండి విశాఖ వెళ్లి రావడం చాలా ప్రయాసతో కూడిన ప్రయాణం. అంత శ్రమపడి అక్కడికి వెళ్లి కచేరీ చేసి డబ్బు సంపాదించవలసిన అవసరం నీకేముంది? మనం ఆర్థికంగా బాగానే ఉన్నాం కదా! నువ్వు బయటకు వెళ్లి శ్రమపడకుండా ఇంటికి వచ్చే పిల్లలెవరైనా ఉంటే వాళ్లకి సంగీతం నేర్పించు. ఎప్పటిలాగే ఇంట్లో హాయిగా సంగీత సాధన చేసుకో" అని అతని ఉద్దేశ్యం చెప్పాడు.

కచేరీ విషయంలో కూడా ఆమెకు నిరాశే ఎదురైంది. అతనికి భార్యంటే వల్లమాలిన ప్రేమ. అందుచేతనే ప్రయాణాలు చేసి కచేరీలకు వెళితే ఆమె ఆరోగ్యం దెబ్బతింటుందని భయం. ఆ ప్రేమా భయమే అతని చేత ఆ విధంగా మాట్లాడించింది. ప్రతి నెలా రాష్ట్రంలో ఏదో ఒక ఊరినుండి ఆమె కచేరీకి పిలుపు వస్తోంది. కానీ భర్త అంగీకరించకపోవడంతో కచేరీలు చేయడం మానేసింది. తన మీద ఉన్న గాఢమైన ప్రేమ కారణంగానే అతను సంగీత కచేరీలకు గానీ, ఉద్యోగానికి కానీ అనుమతివ్వడం లేదని పరిస్థితులతో రాజీ పడింది.

ఆమెది భర్తని ఎదిరించే స్వభావం కాదు. అందుకే అతన్ని వ్యతిరేకించి మాట్లాడదు. పారితోషికం గురించి కాకుండా కచేరీలో శ్రోతల కరతాళ ధ్వనులు, ప్రశంసలను అందుకోవడంలో ఉన్న ఆనందం, తృప్తి తనకు తెల్సు. కానీ తన భర్తకు తెలీదని సరిపెట్టుకుంది. భర్త అనుమతి మేరకు ఆమె ఇంట్లోనే పదిమంది పిల్లలకు సంగీతం నేర్పడం ప్రారంభించింది. ఒక్కొక్కరు నెలకు వంద రూపాయలు ఇచ్చేవారు. మొదటి నెల సంపాదన వెయ్యి రూపాయలు వచ్చింది. దాని కంటే పది మందికి సంగీతం నేర్పించడం ఆమెకు ఎక్కువ సంతోషాన్ని ఇచ్చింది. ఆ డబ్బు భర్తకి ఇవ్వబోతే, "ఇది నీ సంపాదన. నీకు కావాల్సిన వాటికి ఖర్చు పెట్టుకో. నువ్వు బయటకి వెళ్లకుండా, శ్రమపడకుండా ఉండడమే నాక్కావలసింది" అన్నాడు.

కాలం గడుస్తోంది. రోజులు ఎప్పుడూ ఒకేతీరుగ వుండవుగా. ప్రపంచ వ్యాప్తంగా చెలరేగిన ఆర్థిక మాంద్య ప్రభావం ఆదిత్య పనిచేస్తున్న కంపెనీ మీద కూడా పడింది. సీనియర్లను ఉంచి ఆదిత్యలాంటి జూనియర్లని మాత్రం ఉద్యోగాల నుండి తొలగించారు. ఈ పిడుగులాంటి వార్తను ఆదిత్య ఇంట్లో అందరికీ చెప్పాడు.

"నేను వెంటనే ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరడానికి ప్రయత్నం చేస్తాను. ఏదో ఒక

కాలేజీలో తప్పకుండా ఉద్యోగం వస్తుంది. మీరు ఈ విషయంలో ఆందోళన పడొద్దు" అని ఇంట్లోవాళ్లకి ధైర్యం చెప్పాడు. కానీ అతని మనసులో ఏదో మూల అధైర్యం వెన్నాడుతూనే ఉంది.

ఆ రాత్రి కళ్యాణి అతనితో "మీకు ఉద్యోగం ఉన్నప్పుడు నేను పని చేయాల్సిన అవసరం లేదు. కానీ ఇప్పుడు మీకు ఉద్యోగం లేదు. ఇంతకు ముందు అడిగిన స్కూల్‌వాళ్లు ఇప్పుడు కూడా రమ్మంటున్నారు. నేను ఉద్యోగానికి వెళ్లనా? కచేరీలకు కూడా అడుగుతున్నారు. ఈ రెండూ చేస్తే నెలకు మీ అంత కాకపోయినా మన ఇల్లు గడవడానికి కావాల్సినంత డబ్బు సంపాదించగలను. మీ ఉద్దేశ్యం చెప్పండి" అంది. అతను ఆలోచించి "ఈ నెలలో నాకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది. ఇప్పటికీ ఏం మించిపోలేదు. నువ్వు అనవసరంగా ఆందోళన పడకు" అని సర్ది చెప్పాడు. ఆమె ఎదురు మాట్లాడలేదు.

ఆదిత్య హైదారాబాద్‌లో ఉన్న అన్ని ఇంజనీరింగ్ కాలేజీలలో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడు. కానీ అన్నింటిలో కొంత అనుభవం ఉన్నవాళ్లకే ఉద్యోగాలు ఇస్తామంటున్నారు. ఆదిత్య ఎం.సి.ఎ చేసి నేరుగా సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా జాయినయ్యాడు. ఎక్కడా లెక్చరర్‌గా పనిచేయలేదు. అతని జీవితంలో మొదటిసారిగా నిరాశ చోటుచేసుకుంది. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో కళ్యాణితో ఉద్యోగం చేయించడానికి ఒప్పుకున్నాడు.

"నేను చేసిన ప్రయత్నాలు ఇప్పటి వరకు ఫలించలేదు. ఎప్పుడు ఉద్యోగం వస్తుందో ఖచ్చితంగా తెలియడం లేదు. నువ్వు సంగీతం టీచరుగా చేరడానికి, కచేరీలు చేయడానికి ఎటువంటి అభ్యంతరమూ లేదు. నీ ఆరోగ్యం మాత్రం జాగ్రత్తగా చూసుకో. ఎక్కువ శ్రమపడకు. నాకు మళ్లీ ఏదైనా ఉద్యోగం వచ్చిన తర్వాత నువ్వు బయటికి వెళ్లాల్సిన అవసరం ఉండదు"

అన్నాడు తన అసమర్థతకు బాధపడుతూ.

ఈ మాటతో కళ్యాణికి చాలా హుషారు వచ్చింది. తరువాత మానేయడం విషయం అటుంచి ప్రస్తుతానికి తను సంగీతరంగంలో సాధన చేయడానికి అతని అనుమతి లభించడంతో సంతోషంతో ఉప్పొంగిపోయింది. అతనితో "మీరు అధైర్యపడకండి. నాకు చేతనైనంత సాయం చేస్తాను" అంది.

కళ్యాణి సంగీత రంగంలోకి రెట్టింపు ఉత్సాహంతో ప్రవేశించింది. వెంటనే టీచరు ఉద్యోగంలో చేరిపోయింది. నెలకు రెండు, మూడు కచేరీలు కూడా చేస్తోంది. ఆ కచేరీల ద్వారా ఆమె పేరు నానాటికీ పెరిగి మీడియాలోకి వెళ్లింది. సంగీత కచేరీలు చేస్తున్న ఆమె ఫొటోలు, ఇంటర్వ్యూలు బయోడేటాతో సహా వార్తా పత్రికల్లోనూ, వారపత్రికల్లోనూ వచ్చాయి. రేడియో ఆడిషన్‌కు వెళ్లి కర్నాటక శాస్త్రీయ సంగీతంలో 'ఎ'గ్రేడ్ గాయకురాలిగా ఎంపికయింది. టీవీ ఛానల్స్‌లో కూడా ఆమె సంగీత కచేరీలు ప్రసారమయ్యాయి. ఇప్పుడామె పుష్కలంగా రెండు చేతులా డబ్బు సంపాదిస్తోంది. భర్త ఉద్యోగం పోయిన లోటు కనపడకుండా తన సంపాదనతో కుటుంబాన్ని సమర్థించుకు వస్తోంది. అలాగని ఆమెలో గర్వం, అహంకారం ఏమాత్రం రాలేదు. ఎప్పటిలాగే భర్తకు, అత్తమామలకు చేదోడువాదోడుగా ఉంటోంది.

ఆదిత్య ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది. "నా అర్థంలేని భయాలతో ఇంతకాలం నీలో దాగిఉన్న సంగీత కళ బయటకు రానీయకుండా అడ్డుపడ్డాను. పరోక్షంగా నేనే కారకుడినయ్యాను. ఆర్థికావసరం లేనప్పుడు సంగీతం కచేరీలు చేయడం అనవసరమని పొరపడ్డాను. ఎంతోమంది శ్రోతలను కచేరీలలో ఆనందపరిచి వారి ప్రశంసలనందుకోవడం సంగీత విద్వాంసులందరికీ సాధ్యపడదు. అది నీకు సాధ్యపడింది. పైగా సమాజంలో పేరు, గౌరవాన్ని నీ లలితకళ ద్వారా పొందావు. అది నీ అదృష్టం" అన్నాడు ఆదిత్య . ఈ మాటలు కళ్యాణికి ఎంతో సంతోషాన్ని కలగజేశాయి. సంగీత కళ గురించి తన భర్తకు సరైన అవగాహన కలిగినందుకు అతన్ని మనసులోనే అభినందించింది.

ఆదిత్యకు మళ్లీ మంచిరోజులొచ్చాయి. శంకరం స్నేహితుడు ఒక ఇంజనీరు కాలేజీకి ప్రిన్సిపల్. మాటల సందర్భంలో శంకరం తన కొడుకు పరిస్థితిని ఆ ప్రిన్సిపల్‌కి చెప్పాడు. ఆయన శంకరంతో "ఆదిత్య అనే పేరుతో ఒక దరఖాస్తు వచ్చింది. అయితే అతను నీ కొడుకని నాకిప్పుడే తెలిసింది. మా కాలేజీలో ఒక లెక్చరర్ పోస్ట్ అనుకోకుండా ఖాళీ అయింది. దానికి మీ వాడిని ఎపాయింట్ చేస్తూ వెంటనే ఆర్డర్స్ పంపిస్తాను" అన్నాడు.

ఈ శుభవార్త ఇంటికి చేరింది. ఆదిత్య కళ్యాణితో "నాకు మళ్లీ ఉద్యోగం వచ్చింది. అందుకని నీ సంగీత కచేరీలు మానొద్దు. పురుషులకైనా, స్త్రీ కైనా వాళ్ల ప్రవృత్తి ఏదైనా అది వృత్తిగా మారినప్పుడు దానికోసం ఎంత కష్టపడినా శ్రమ అనిపించదు. పైగా వృత్తిగా మారిన ప్రవృత్తి నుండి వాళ్లు పూర్తి ఆనందాన్ని, తృప్తిని పొందుతారు. వృత్తి, ప్రవృత్తి వేర్వేరు అయినప్పుడు ఆ రెండింటి మధ్య సమన్వయం ఏర్పడకపోవచ్చు. ప్రవృత్తే వృత్తిగా గలవారు ఏ కొద్దిమందో అదృష్టవంతులుంటారు. ఇక నీ సంగీతం విషయానికొస్తే అది నిజానికి ఒక గంధర్వ విద్య. ఈ లలిత కళ నీకు మొదట ప్రవృత్తిగా ఉండి తర్వాత కొన్ని కారణాల వల్ల వృత్తిగా మారింది. అయినప్పటికీ దాని ద్వారా ఆత్మసంతృప్తి లభిస్తుంది. ఇది నువ్వు ఎప్పటికీ మానొద్దు" అన్నాడు.

తన జీవితాన్ని సంగీతంతో సార్థకం చేసుకోవడానికి ఇక ఎటువంటి ఆటంకం లేనందుకు కళ్యాణి సంతోషించింది. ఆ కళకి అంకితం కావాలని నిశ్చయించుకుంది.

★

అసూయను జయించడం ఎలా?

అసూయ అనేది ఒక ప్రతికూల ఆవేశం. ఇది స్నేహితులు, ప్రేమికులు, సహోద్యోగులు, జీవిత భాగస్వాముల మధ్య కూడా తలెత్తుతూ ఉంటుంది. దీనిని జయించాలంటే ఆ రకమైన భావాలను కలిగించే నమ్మకాలనుండి బయటపడాలి. తోటివారికి ఎక్కువ ఆదాయం వచ్చినా, అతని కృషి గుర్తింపు పొందినా, ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కల్గివున్నా, తెలివైన పిల్లలు ఉన్నా మనసు తట్టుకోలేదు. అసూయ మొదలవుతుంది. మనకు కావలసింది పక్కవారికి వచ్చేసిందంటే ఒక ఫీలింగ్. ఈ రకమైన అనుభవాలు ఎవరికైనా, ఎప్పుడైనా, ఇంటి దగ్గర లేదా పనిచేసేచోట రావచ్చు. దీనికి మినహాయింపు లేదు. ఉద్యోగస్తులు, కళాకారులు, వ్యాపారస్తులు, విద్యావేత్తలు, గృహిణులు వీరందరిలో సహజంగా ఇది తొంగి చూస్తూ ఉంటుంది.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

గర్వం, అత్యాశ, మోహం, కోపం, తిండిపోతుదనం, సోమరితనం ఇవన్నీ అసూయకు పునాదులుగా ఉంటాయి. వీటికి తోడుగా ఓర్వలేనితనం, వ్యతిరేక ధోరణులు మనిషిలో బుసకొడుతూ ఉంటాయి. ఈ అసూయకు బానిసైనవారు చాలా నష్టపోతారు. ఎంతో అసౌకర్యానికి గురవుతారు.అసూయ మనిషిని గాయపరుస్తుంది. కలవరపెడుతుంది. నిరుత్సాహ పరుస్తుంది. అవమానపరుస్తుంది. మనిషిలో ఒత్తిడిని పెంచుతుంది. తనపై తనకు అదుపు తప్పుతుంది. ఇంతకన్నా ప్రమాదం ఏముంటుంది?

అదొక ప్యారడైమ్

ప్రేమ, అసహ్యం, కోపం, ఆకలి మాదిరి అసూయ కూడా ఒక ప్రాథమిక ఆవేశం. యవ్వనంలోకి అడుగుపెట్టిన ప్రతిభావంతులు, అదృష్టవంతులు, ఎంతో ఆకర్షణీయంగా కన్పించేవారు, ఎవరైనా సరే ఎన్నో అపజయాలను చవిచూసి ఉంటారు. అంటే వీరిలో పూర్తిగా పోటీతత్వంతో పాటు అసూయ కూడా ఎదిగి ఉంటుంది. అయినప్పటికీ ఎవరికి వారే ఈ అనుభవాలను భిన్నంగా పొందుతూ అసూయను రకరకాలుగా వ్యక్తపరుస్తూ ఉంటారు. చిన్ననాటి అనుభవాలు, బాధలు, ఇతరుల ప్రవర్తన నమ్మకాన్ని పోగొట్టి అసూయను పెంచుతాయి. పరిసరాల ప్రభావం వల్ల మనిషిలో కొన్ని నమ్మకాలు కల్గిస్తాయి. అవే అసూయకు కేంద్రబిందువులవుతాయి. ఇదే ఒక ప్యారడైమ్ (అవగాహనా చట్రం) గా తయారవుతుంది. మనకు రావలసిన విజయాలు పక్కవారికి వచ్చాయన్న నమ్మకంతో అసూయ వేళ్లూరుతుంది. తోటి వ్యక్తికి పదోన్నతి లభిస్తే 'అంతకన్నా ఉన్నతస్థానానికి నేను వెళితేనే అతనిని ఆమోదిస్తాను' అనే మరొక భావం మనుషుల్లో పేరుకు పోయి ఉంటుంది. ఎవరైనా సరే మన తర్వాతే అనే ఫీలింగ్. ఇతరులకు ఉండే ఆస్తులు మనకు వస్తే మంచి జీవితం జీవించడం సాధ్యమవుతుందనే నమ్మకంతో కూడా ఉంటారు. పక్కవారికున్న బంగ్లా, కారు, నగలు తనకుంటే తనేమిటో తెలుస్తుంది అనుకుంటాడు. ఇతరుల జ్ఞానాన్ని, కఠిన పరిశ్రమను, నైపుణ్యాలను అసూయ కారణంగా అంగీకరించలేరు. అంతేకాదు ఇతరులు తక్కువగా ఉంటే తాను విజయాలు సాధించగల్గుతాడనే నమ్మకంతో ఉంటారు. ఇవన్నీ మనిషిని అసూయ చట్రంలో బాగా ఇరికించేస్తాయి. వీటినుండి బయట పడగల్గితే అసూయ కోరల నుండి బయటపడగల్గుతారు.

ఏం చెయ్యాలి?

మనకు అసూయను కల్గిస్తున్న ఫీలింగ్స్ నుండి తప్పుకోగలగాలి. ముందుగా మిమ్మల్ని మీరు అంగీకరించుకోవాలి. మనం మరొకరి వలె ఉండబోమనే విషయం గుర్తుంచుకోవాలి. మరొకరి అందమైన ఆకృతి, ఆస్తులు మీకు రావనే సత్యాన్ని గ్రహించుకోగల్గాలి. ఎవరికి వారే వారి దిశలో బలవంతులుగా ఉంటారనే నిజాన్ని మరచిపోకూడదు. మనల్ని మనం అంగీకరించుకోగల్గితే ఇతరులతో సరిపోల్చుకునే దురవస్థకు లోనకాం. మీ అంతర్గత శక్తులను మీరు వినియోగించుకోవడం ప్రారంభించాలి. మీలో అనుకూల, తటస్థ, వ్యతిరేక ధోరణులు మిశ్రమంగా ఉంటాయి. మీ లక్ష్యాలను స్థిర పరచుకుని వాటి సాధన కోసం కృషి చేయాలి. అనుకూల ధోరణులను మాత్రమే వినియోగించుకోవాలి. మీరు చేతనయినంత మేలుగా పని చేస్తున్నారనే, సంతృప్తి కన్నా మించిన సంపద ఉండదు. మనం చేసే పనుల నాణ్యతను మనం గమనించగల్గుతాం. ఇతరులు మన పనిని ఎలా భావిస్తున్నారు అనే విషయం గురించి ఆలోచించకూడదు. మనిషి సంపాదించిన సంపదల కన్నా మనిషి ఇతరులతో ఏర్పరచుకున్న సత్‌సంబంధాలు చాలా గొప్పవని భావించాలి. బోలెడంత ఆస్తులు సంపాదించిన వ్యక్తి చివరిదశలో తాను సంపాదించిన ఆస్తుల గురిచి తలవంచక, తనంటే అభిమానించే వ్యక్తులను గుర్తు చేసుకుంటాడు. ఈ మానవ సంబంధాలకు మించిన సంపదలేదని తెలుసుకుంటాడు. ఈ మానవ సంబంధాలకు మించిన సంపద లేదని తెలుసుకుంటాడు. అటువంటి అనుభవాలను మనం ఉపయోగించుకుని ఇతరులతో అనుబంధం పెంచుకునే ప్రయత్నం నిరంతరం చేస్తూ ఉంటే అసూయకు దూరం అవుతారు. మీకు ఏమి ఉన్నదో చూసుకుని ఆనందించాలి గానీ ఏమి లేదో గమనించుకుని విచారించకూడదు. ఆరోగ్యకరమైన పోటీకి తయారు కావాలి గానీ అనారోగ్యమైన పోటీ వైపు దృష్టి మళ్లకూడదు. పోటీ మీ ఆలోచనలను, ప్రాముఖ్యతలను, మీ ఉనికిని తోసిరాజనే స్థితికి రాకుండా చూసుకోవాలి.

సంతోషించాలి!

➧ ఇతరుల సంతోషంలో పాలు పంచుకోవాలి. వారి విజయాలను సంతోషంగా అంగీకరించడం అలవరచుకోవాలి. అప్పుడు మనం సాధించాల్సిన పనులపై దృష్టి కేంద్రీకరించి విజయాలు సాధించగల్గుతాం. ఇతరుల పట్ల ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండాలి. ➧ అసూయతో కూడిన ఆలోచనలను సముద్రంలో కలిపేయాలి. మీ పొరుగువారి సంపదలు మీకు సొంతం కావు. మనసులో అసూయ తలెత్తితే అది మిమ్మల్ని దహించి వేస్తుందని జ్ఞాపకం తెచ్చుకుని దానిని మనసు నుండి తుడిచివేయాలి. మీ జీవితాన్ని పురోగతి వైపు నడిపించే చక్రం మీ చేతిలోనే ఉంటుంది. ➧ ఇతరుల విజయాలు మీలో అసూయను కల్గిస్తుంటే మహాపురుషుల జీవిత గాథలు చదవండి. వారు అంతిమ విజయాలు సాధించడానికి ముందు ఎన్నిసార్లు పరాజయం పాలయ్యారో తెలుస్తుంది. మనిషి విజయసాధన వెనుక అతడు ఎన్ని త్యాగాలు చేశాడో పరిశీలిస్తే మీలో అసూయ తలెత్తదు. ➧ మనిషిలో ఉండే అంతులేని అహం తాను అందరికన్నా అధికుడనే భావాన్ని కల్గిస్తుంది. ఇతరుల పట్ల అసూయను కల్గిస్తుంది. ముందుగా మీలోని ఆ అహాన్ని తరిమేయాలి. ఎవరకి వారే గొప్ప. ఎవరకన్నా ఎవరూ గొప్పవారు కాదు అనే విషయం తరచు గుర్తుచేసుకుంటూ ఉండాలి. 'నేనొక ప్రత్యేకమైన వ్యక్తిని' అనే ఫీలింగ్‌ను మరచిపోవాలి. ➧ మీ జీవితంలో మీరు ఏం సాధించదలచుకున్నారో ఒక స్పష్టత కల్గి ఉండాలి. మీకు డబ్బు సంపాదన ముఖ్యమా? విజయాలు ముఖ్యమా? లేదా స్నేహితులు, కుటుంబసభ్యులతో బంధాలు, అనుబంధాలు ప్రధానమా? సైన్సు ప్రపంచంలో నూతన పోకడలు సృష్టిద్దామనుకుంటున్నారా? మీ లక్ష్యం మీకు స్పష్టంగా తెలిస్తే మీ రంగానికి సంబంధించని రంగంలోని విజేతలను చూసి మీకు అసూయ కలగదు. ఎందుకంటే ఆ రంగం మీకు సంబంధించినది కాదు. ➧ మీ కన్నా చాలా తక్కువ స్థాయిలో, గుర్తింపు పొందక తెలివైన ప్రతిభావంతులు ఎందరో సమాజంలో అట్టడుగున ఉండిపోయారు. వారందరి కన్నా మీరు చాలా మేలయిన స్థానంలో ఉన్నారని మరచిపోకండి. అసూయ పారిపోతుంది.

★

కంప్యూటర్లు... కరెంటు ఆదా

"కంప్యూటర్లకు అవసరమైన విద్యుచ్ఛక్తిని తయారు చేయడానికి ఇంధనాలు మండించడమో లేక ఇతరత్రా అవలంభించే మార్గాల వల్లో పర్యావరణానికి జరిగే నష్టం చాలా ఎక్కువగా వుంటోంది. కంప్యూటర్ల నుండి విడుదలయ్యే కార్బన్ మోనాక్సైడ్ వల్ల జరిగే నష్టం కూడా తక్కువేమీ కాదు. పైగా దీంతోపాటు కంప్యూటర్లలో పనికిరాని విడిభాగాల వల్ల కూడా పర్యావరణం దెబ్బతింటోంది. అందువల్ల కంపూటర్లను వాడనప్పుడు ఆఫ్ చేయడం వల్ల చాలావరకు మేలు జరుగుతుందని...అయినా దీన్నెవరూ పట్టించుకోవడంలేదు"అని పర్యావరణవేత్తలు ఆవేదన చెందుతున్నారు. మరి కంప్యూటర్ వినియోగదారులు కరెంటు ఎలా ఆదా చేసుకోవచ్చో చెప్పకుందామా!

కంప్యూటర్లు మన జీవితాలతో ఎంతగా పెనవేసుకుపోయాయో అందరికీ తెలిసిందే. ఇళ్ళల్లో వుండే కంప్యూటర్ల దగ్గర నుండి చిన్నా పెద్ద ఆఫీసుల వరకు దేశవ్యాప్తంగా లక్షలాది కంప్యూటర్లు వినియోగంలో వున్నాయి. వీటికి అయ్యే విద్యుత్‌ను లెక్కిస్తే గుండె గుభేలుమనకతప్పదు. అయినప్పటికి విద్యుత్ వినియోగం ఆదా చేయడంలో ఎల్లెడలా అశ్రద్ధ పెద్దఎత్తున కొనసాగుతూనే వుంది. కొన్ని ఆఫీసుల్లో కంప్యూటర్లను వాడకపోయినప్పటికీ అవి ఆన్ చేసే వుంటాయి. దీనివల్ల జరిగే విద్యుత్ నష్టాన్ని ఆ కంప్యూటర్ వినియోగదారు కానీ, ఆయా సంస్థల మేనేజ్‌మెంట్లు గానీ అంతగా పట్టించుకోవు. తద్వారా జరిగే విద్యుత్ నష్టం అపారం. కంప్యూటర్లకు వినియోగించే విద్యుత్‌లో సగం వరకు వృధా అవుతోందని ఒక అంచనా. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించడం వల్ల వృధా అవుతోన్న విద్యుత్‌ను గణనీయంగా తగ్గించవచ్చు. ఒక సర్వే ప్రకారం తేలిందేంటంటే డెస్క్‌టాప్ పి.సిలలో వాడే విద్యుత్‌లో సుమారు 70%-80% వరకు మనం ఆదా చేయవచ్చు. ఆ చిట్కాలేవో చూద్దాం...

◆ కంప్యూటర్ ఉపయోగించనప్పుడు మానిటర్ స్విచ్ ఆఫ్ చేయడం.

◆ మానిటర్ స్క్రీన్ బ్రైట్నెస్‌ను వీలైనంత మేర తగ్గించడం.

◆ కంప్యూటర్లో పవర్ మేనేజ్‌మెంట్ ఫీచర్‌ని ఆన్ చేయడం. ప్రస్తుతం లభ్యమయ్యే కంప్యూటర్లో దాదాపుగా పవర్ మేనేజ్‌మెంట్ ఫీచర్ ఉంటోంది. దానిని సరిగ్గా కాన్ఫిగర్ చేయడం ద్వారా మన కంప్యూటర్ ఉపయోగంలో లేనప్పుడు దానంతట అదే ఆగిపోవడం లేదంటే కేవలం మోనిటర్ ఒక్కటే స్విచ్-ఆఫ్ కావడం జరుగుతుంది.

◆ కొత్త కంప్యూటర్లు కొనేముందు అవి తప్పని సరిగా ఎనర్జి-స్టార్ 4.0 కంప్లైంట్ ఉండేలా చూసుకోవడం.

◆ సిఆర్‌టి మోనిటర్లతో పోల్చితే ఎల్‌సిడి మోనిటర్లు చాలా తక్కువ విద్యుత్‌ను వినియోగించుకుంటాయి. సాధ్యమైనంత వరకు ఎల్‌సిడి మోనిటర్లకే ప్రాధాన్యతనివ్వడం ద్వారా విద్యుత్ ఆదా అవడమేగాక యుపిఎస్ బ్యాకప్‌కూడా ఎక్కువకాలం వస్తుంది.

◆ తరచుగా కంప్యూటర్‌ని ఆన్ చేసి పనిచూసుకొన్న తర్వాత షట్‌డౌన్ చేసి.. మళ్ళీ పని ఉందనుకొని మళ్ళీ ఆన్ చేయడం... ఇలా మళ్ళీమళ్ళీ చేయడం వల్ల విద్యుత్ వినియోగం పెరగడంతోపాటు హార్డ్‌డిస్క్ మన్నిక కూడా తగ్గుంది. ఇటువంటి సందర్భాల్లో కంప్యూటర్‌ను షట్ డౌన్ చెయ్యకుండా స్టాండ్‌బైలో వుంచడం ఉత్తమం. ఇలా చెయ్యటం వల్ల విద్యుత్ వాడకాన్ని తగ్గించవచ్చు.

ఉదాహరణకు ఒక కంప్యూటర్‌ను స్టాండ్‌బైలో ఉంచడం వల్ల గంటకు కేవలం మూడు వాట్ల విద్యుత్ మాత్రమే వాడుకుంటుంది. అంటే 333గంటలు స్టాండ్ బై లో ఉంచితే కేవలం ఒక యూనిట్ విద్యుత్ మాత్రమే వినియోగం అవుతుంది.

◆ ర్యామ్ తక్కువగా ఉన్నప్పుడు మోనిటర్ మీద రకరకాల థీమ్స్ పెట్టుకోవడం వల్ల మోనిటర్‌పై భారం పడుతుంది. తద్వారా విద్యుత్ వినియోగం కూడా ఎక్కువగానే అవుతుంది.

◆ మోనిటర్ స్క్రీన్‌ను బ్లాక్‌లో పెట్టుకోవడం వల్ల విద్యుత్ ఆదా అవడంతోపాటు కంటికి కూడా ఇబ్బంది కలిగించదు. సిస్టం మీదున్న ఐకాన్స్‌ని కూడా తేలికగా గుర్తించగలుగుతాం. మోనిటర్ జీవిత కాలం కూడా పెరుగుతుంది.

-కె.ఎక్స్.రాజు

ఏ కాంపొనెంట్‌కి ఎంత విద్యుత్ కావాలి?

కొత్తగా కంప్యూటర్ కొనుగోలు చేసేవారు ఎస్‌ఎంపిఎస్ సామర్థ్యం విషయంలో తమ సిస్టంలోని ఇతర కాంపొనెంట్‌ల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఎస్‌ఎంపిఎస్ వాట్స్‌ను ఎంచుకోవాలి. సాధారణంగా వివిధ కాంపొనెంట్‌లు ఎంత విద్యుత్ వినియోగించుకుంటాయో చూద్దాం.

ప్రొసెసర్ :		
ఎఎండి యాథ్లాన్ 64/64ఎఫ్ఎక్స్	-	90-110 వాట్స్
ఎఎండి థండర్ బర్డ్	-	50-60 వాట్స్
ఎఎండి యాథ్లాన్ ఎక్సపి	-	50-80 వాట్స్
ఎఎండి డ్యూరాన్	-	40-60 వాట్స్.
ఇంటెల్ పి4	-	60-100 వాట్స్
ఇంటెల్ పి3	-	25-40 వాట్స్
ఇంటెల్ సెల్‌రాన్	-	30-60 వాట్స్
గ్రాఫిక్ కార్డ్ :		
బేసిక్	-	25 వాట్స్
హై పెర్ఫార్మెన్	-	35-100 వాట్స్
ఇతర పరికరాలు :		
మదర్‌బోర్డ్	-	18-28 వాట్స్
సీడి రామ్ / రైటర్	-	25-35 వాట్స్
హార్డ్‌డిస్క్	-	25 వాట్స్
మెమరీ మాడ్యూల్	-	7-12 వాట్స్
యుఎస్‌బి / ఫైర్‌వేర్	-	5-10 వాట్స్
పిసిఐ సౌండ్‌కార్డ్స్	-	5-10 వాట్స్
అదనపు పిసిఐ కార్డ్స్	-	5 వాట్స్
ఫ్లాపీ డ్రైవ్	-	5 వాట్స్
సిపియు ఫ్యాన్	-	3 వాట్స్
కీబోర్డు, మౌస్	-	6 వాట్స్

ఇలా అన్ని పరికరాల పవర్ సప్లై అవసరాలను లెక్కించుకున్న మీదట మొత్తం ఎంత విలువ వస్తుందో దానికి 30% అదనంగా కలుపుకుని ఎస్‌ఎంపిఎస్ కెపాసిటీని నిర్ణయించుకోవడం వల్ల ఇబ్బందులు తప్పుతాయి.

కవలలు ఏవి?

హాయ్.. ఇక్కడ ఆరు కీటకాలున్నాయి కదా! అన్నీ చూడ్డానికి ఒకేలా ఉన్నా రెండు మాత్రమే కవలలు. అవేంటో చెప్పుకోండి చూద్దాం.



జవాబు: 4,6

ఎంతమంది ఉన్నారో...!

బుజ్జాయిలూ... ఈ బొమ్మలో మీకు క్రీస్తు కనిపిస్తున్నాడు కదూ! ఆయన ఒక్కడే కనిపిస్తున్నాడా? సరిగ్గా చూడండి. బయట ఉన్నవాళ్లు కాకుండా ఆయన ముఖంలోనే ఏడుగురు ఉన్నారు. అయితే అక్కడ మొత్తం ఎంతమందిఉన్నారో చెప్పండి.

జవాబు: 16

విహంగం

నిశాచరి

ఫ్రెండ్స్...! ఈ రోజు మనం మాట్లాడుకోబోయే జీవి ఏదో తెలుసా?! మీరు ఎప్పుడైనా విన్నారా? ఎవరైనా ఒకేవైపు అదేపనిగా చూస్తున్నారనుకోండి. ఎంటలా చూస్తావ్. గుడ్లగూబలా! అంటుంటారు.

ఆ... ఆ పక్షి గురించే ఈ వారం చెప్పుకుందాం. ఇది చాలా బలమైనది. కళ్లు పెద్దగా గుండ్రంగా కనిపిస్తాయి. పరిమాణంలో దగ్గర దగ్గర గద్దంత ఉంటుంది. గుడ్లగూబల్లో కొమ్ముల గుడ్లగూబ, చేపల గుడ్ల గూబ అనే రకాలున్నాయి. కొమ్ముల గుడ్లగూబకి కొమ్ముల్లాగ రెండు కుచ్చులు తలమీద కనిపిస్తాయి. దీని శరీరంపై గోధుమరంగు, పసుపు కలిసిన నల్లటి చారలు, చుక్కలు కనిపిస్తాయి. కొమ్ముల గుడ్లగూబ శరీరంలో పసుపు రంగు ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పక్షి మిగతా పక్షులన్నింటిలో ఒక విషయంలో భిన్నంగా ఉంటుంది. అదేంటో తెలుసా? ఇది పగలంతా విశ్రాంతి తీసుకుంటుంది. సాయంకాలానికి తిరగడానికి బయటికి వస్తుంది. రాత్రుళ్లు బాగా తిరుగుతుంది. అంటే నిశాచరి అన్నమాట. అయితే కొన్ని పగలు కూడా కనిపిస్తుంటాయి. ఇంకో విషయమేంటంటే ఈ పక్షి అసలు గూడే కట్టుకోదు. మట్టి గుట్టలు, పాత ఇళ్లలోని గూళ్లే దీని నివాసం. మిగతా పక్షుల్లాగే ఇది మూడునాలుగు గుడ్లను పెడుతుంది. ఇవి మీగడ తెలుపు రంగులో ఉంటాయి. తొండలు, చేపలు, ఎలుకలు, పెద్ద కీటకాలు, పీతలను ఆహారంగా తీసుకుంటుంది.

హా...హా...హా

ప్రార్థన



చర్చి మినిస్టర్ : చూడు బాబూ! నువ్వు ఏదైనా తినేముందు దేవుడికి ప్రార్థన చేస్తావా?

బాబు : నాకు ప్రార్థన చేయాల్సిన అవసరం లేదండి. మా అమ్మ బాగా వంట చేస్తుంది.



ఆస్ట్రేలియా వాసి

మామ్మకి ఓ గైడ్ జూ మొత్తం తిప్పి చూపిస్తున్నాడు.

గైడ్: మామ్మా! ఇది కంగారూ. ఆస్ట్రేలియాలో మాత్రమే ఉంటుంది.

బామ్మ : నిజమా! అయితే నా మనుమరాలు ఆస్ట్రేలియా వాడినే పెళ్లి చేసుకుందే.

వయసు ఎంత?



ఇద్దరు తోబుట్టువులున్నారు. వారిలో అబ్బాయి వయసు రెండేళ్ల తర్వాత ఇప్పుడున్న వయసుకు రెట్టింపు అవుతుంది. అమ్మాయి వయసు నాలుగేళ్ల తర్వాత మూడు రెట్లు అవుతుంది. వాళ్లిద్దరిలో ఎవరు పెద్దవాళ్లో చెప్పండి.

బైండింగ్



ఒక బైండింగ్ చేసిన పుస్తకం రేటు రూ.2.50 పైసలు. అయితే బైండింగ్ చేయడానికి అయ్యే ఖర్చు కన్నా పుస్తకం ఖరీదు ఐదు రెట్లు ఎక్కువ. అంటే బైండింగ్ ఖరీదు ఎంత?

వయసెంత?: ఎవరూకాదు. ఇద్దరూ కవల పిల్లలు. అబ్బాయి వయసు రెండు సంవత్సరాలు. అంటే రెండేళ్ల తర్వాత నాలుగేళ్లు అవుతుంది. అలాగే అమ్మాయి వయసు ఇప్పుడు రెండేళ్లు. నాలుగేళ్లకి ఆరు సంవత్సరాలు వస్తాయి. అంటే మూడు రెట్లు అన్నమాట. **బైండింగ్ ఖరీదెంత?**: 50 పైసలు.

రంగులు నింపేద్దాం...!

చిన్నారులూ... ఇక్కడ ఓ చక్కని గులాబీ మొక్క ఇచ్చాం చూశారుగా. ఈ మొక్కలో ఒక్కో భాగానికి ఒక్కో నెంబరు వుంది. ఏ నెంబరులో ఏ రంగు వేయాలో కింద ఇచ్చాం. మరి గబగబా రంగులు నింపేస్తారా..?



1 - ఎరుపు 2 - పసుపు 3 - నీలం 4 - ఆకుపచ్చ 5 - కాషాయం 6 - వంకాయ 7 - చాక్లెట్ 8 - నలుపు 9 - గులాబీ 10 - బూడిదరంగు



ఏది ఎక్కడ?

ఫ్రెండ్స్... ఇక్కడ విమానం బొమ్మ ఉంది. పైనే దానికి సంబంధించిన విడి భాగాలు ఉన్నాయి. మీరేం చేయాలంటే ఆ భాగాల్ని ఎలా అమరిస్తే కరెక్టు ఆకారం వస్తుందో చూసి పెట్టేసెయ్యండి.

ఏంటలా ఆశ్చర్యంగా చూస్తారు? ఆఁ...
వేసవిలో మీరేనా ఏంటి కూల్‌డ్రింక్స్ తాగేది.



మాటల కోట - 48

రూపకల్పన : కర్లపాలెం

	1	2	3		4	5		
6		7			8			9
10			11				12	
		13			14	15		
	16		17		18			
19		20		21				22
23			24		25		26	
		27			28	29		
	30				31			

అడ్డం :

1.కొత్త సూత్రం కనిపెట్టినప్పుడు ఆర్కిమెడీస్ ఇలా అరిచాడు (3)
4. సంబరం కాదు... ఆకాశం (3)
7. ప్రస్తుత తెలుగు సంవత్సరం పేరు (2)
8. నీరు (2)
10. జంబూకం (2)
11. తిరగబడిన స్వర్గం (3)
12. చంద్రబాబునాయుడి ఇంటిపేరు (2)
14. నేను నా... (దర్శి చెంచయ్యగారి ప్రసిద్ధ నవల) (2)
16. అందమునకు జంటపదమే కానీ తిరగబడింది (3)
18. చెల్లాచెదురు కావడం. కకా... (3)
20. సముద్రము (3)
23. చెప్పినదానికల్లా తలాడించే గంగిరెద్దుని.... బసవన్న అంటారు (2)
24. వెంటనే గ్రహించావే (3)
26. ... దోశ, వడ, అప్పడం (2)
27. 'విలన్'లో రాజశేఖర్ సరసన నటించిన హీరోయిన్ .... ధూపియా (2)
28. తరగతిలో రెండో సగం (2)
30. పదం (3)
31. ముసల్మానులు ఉపవాసం ఉండే పండుగ (3)

నిలువు :

2. గీత (2)
3. మిరప రుచి (3)
4. ఆంజనేయుడి తల్లి (5)
5. బలవంతుడి శక్తి (2)
6. ప్రసిద్ధ తెలుగు గాయని (3)
9. రాజులకు రాజు (3)
13. మందమైన పెట్టె (3)
15. అనుమానాలు (3)
17. సూర్యుడికి, చంద్రుడికి, భూమి అడ్డం వచ్చినప్పుడు ఏర్పడే గ్రహణం (5)
19. ఎంకి పాటలు రాసిన సుబ్బారావు ఇంటిపేరు (3)
21. నంది తిమ్మన అనగానే ముందు గుర్తుకొచ్చే ముఖంలోని భాగం (2)
22. మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఆర్థికమంత్రి కూడా (3)
25. వేడి పురము (3)
27. తోకలేని నేరము (2)
29. తిరగబడిన జాతి (2)

మాటలకోట - 47 జవాబు

	1 తూ	2 నీ	3 గ		4 రా	5 గా	లు	
6 కుం		7 వే	స	వి	కా	లం		8 వే
9 భ	10 లే		టు		సి		11 తా	రు
12 కో	కి	ల		13 వే		14 టీ	వి	
ణం			15 చ	ద	రం			16 తె
	17 శ	క్తి		ము		18 ప	19 ది	లం
20 రా	శి		21 జ		22 ల		23 నం	గా
గి		24 అ	నం	త	పు	25 రం		ణా
	26 క	మ్మ	న		27 వి	హా	రి	

ధనికుడి కవిత్వం

బాగ్దాద్ నగరంలో అల్తాఫ్ అనే ధనవంతుడుండేవాడు. అతని వద్ద లేఖకునిగా పనిచేసే అల్‌ఫిదా చక్కని కవిత్వం రాసేవాడు. తనకు తెలిసిన మిత్రులకు వినిపిస్తుండేవాడు. అంతేకాకుండా వీలయినప్పుడల్లా కవితా గోష్టులలో తన కవిత్వాన్ని వినిపించేవాడు. దీంతో అల్‌ఫిదాకు చక్కని పేరు, ప్రశంసలు లభించసాగాయి. అల్తాఫ్‌కు కూడా కవిత్వం రాయాలని, రసజ్ఞుల మన్ననలు పొందాలని, అందమైన ఉన్నత కుటుంబాలకు చెందిన స్త్రీల మనసు చూరగొనాలని ఉబలాట పడ్డాడు. కలం తీసుకుని, మబ్బుల్లోకి చూస్తూ గంటలకొద్దీ గడిపేవాడు. మరికొన్ని రోజులు ఖర్జూర తోటల్లో తిరుగుతూ కవిత్వం రాయాలని తెగ ప్రయత్నం చేసేవాడు. కానీ ఒక్కవాక్యం కూడా రాయలేకపోయేవాడు. తనకు కవిత్వం రాయడం చేతకాదు, అది కావాలనుకున్నప్పుడు డబ్బుతో కొని తెచ్చుకునే వస్తువు కాదని నిర్ణయించుకున్నాడు. ఆ రోజు కొలువుకు వచ్చిన ఫిదాతో "నువ్వు రాసిన కవిత ఇవ్వు. దాన్ని చదివి జనాన్ని మెప్పించాలి. నేనే రాశానంటే నీకు అభ్యంతరం లేదుగా" అన్నాడు.

ఇవ్వనంటే ఉద్యోగం నుండి తీసేస్తాడనే భయంతో తను రాసిన ఒక కవితను తెచ్చి వర్తకుడికిచ్చాడు. దాన్ని కిందకి మీదకి ఒకటికి నాలుగు సార్లు చదువుకున్నాడు. కవిత బాగుందనిపించింది. 'ఎవరికి చూపిద్దామా? ఎంత తొందరగా అందరి ప్రశంశలు పొందుదామా?' అని ఆత్ర పడ్డాడు. తన కవిత వినడానికి ఎవరు వస్తారా అని ఎదురు చూడసాగాడు. అప్పుడే అటుగా వెళుతున్న నస్రుద్దీన్ కనిపించాడు.

"ముల్లా బావ! ఇలారా.. మీతో చాలా ముఖ్యమైన పని పడ్డది" అని ప్రేమగా ఆహ్వానించాడు.

బజార్లు తిరగడం, నలుగురు కనిపిస్తే చలోక్తులు విసరడం తప్ప వేరే పనేం లేదు నస్రుద్దీన్‌కి. కనుక, నస్రూ వెంటనే దుకాణంలోకి వచ్చాడు. అతన్ని సాదరంగా తన ఇంట్లోకి తీసుకెళ్లి పట్టుపరుపుపై కూర్చోబెట్టాడు. ఎదురుగా ఒక బల్లమీద ద్రాక్ష సారాయి, నంజుకుతినేందుకు మెత్తటి పొట్టేలు మాంసం పెట్టాడు. "ఉమర్ అల్ దీన్ తనకే పెద్ద కవిత్వం వచ్చని మొన్న బంగారు వర్తకుడి భార్య జుబేదా ముందు ఎంత ఫోజిచ్చాడు. నాకు చాలా అవమానమనిపించింది ఆ విందులో. కవిత్వం రాయడం ఏమన్నా గొప్పా? నేనూ రాశాను ఈ కవిత. ఎలా ఉందో తమరు నిర్మొహమాటంగా అభిప్రాయం చెప్పాలి" అని తన జేబులో ఉన్న కాగితం తీసి మడతలు విప్పసాగాడు.

నస్రూ హాయిగా సారాయి చప్పరిస్తూ, తునకలు నములుతూ చెప్పమన్నట్లు చూశాడు. అల్తాఫ్ కవిత్వం చదవడం మొదలుపెట్టాడు. ఒక్కో వాక్యాన్నే పదిసార్లు వత్తి వత్తి చదువుతూ, పదాల్ని విరిచేసి, వాటి నడ్డి విరగ్గొట్టసాగాడు. పూనకం వచ్చినవాడిలా ఆవేశంతో ఊగిపోతూ, చేతులు గాల్లోకి విసురుతున్నాడు. మనిషి నిలువెల్లా ఊగిపోతూ కుప్పిగంతులు వేస్తూ చదవసాగాడు. ఇంతాచేసీ అది ప్రేమ కవిత్వం. ఆ సారళ్యత కానీ, మృదుత్వం, లాలిత్యం కానీ అతని ఉచ్ఛరణలో ఎక్కడా కనిపించలేదు. ఇది తప్పకుండా అల్తాఫ్ రాయలేదనే విషయం అర్థమయిపోయింది నస్రూకు. అయినా పైకి ఆ మాట అనకుండా అల్తాఫ్ చదవడం ఆపినప్పుడల్లా "వహ్వా... వహ్వా...." అనసాగాడు. మరోసారి "క్యా లిఖా హై... ఓ గాలిబ్ ఆప్‌కా సామ్నే ఏక్ బచ్చా హై, ఏ గానే సునేతో కోసా లడ్‌కీ భీ ఆప్‌కే సామ్నే మొహబ్బత్ సే ఆయేంగీ" అని ప్రశంసించసాగాడు. సారాయి తునకలు మరి కాసిని వడ్డించాడు. నస్రూ ప్రశంసించిన కొద్దీ రెచ్చిపోతూ, చదివిందే చదవడం, తిరగేసి మరగేసి చదవడం చేయసాగాడు. కొన్ని గంటలపాటు బీభత్సంగా అతని కవితా పాటవం సాగింది. నస్రూ ముందు పెట్టిన ద్రాక్షసారాయి, పళ్లెంలోని తునకలు కూడా అయిపోయాయి. ఇక పట్టనంతగా పొట్ట నిండిపోయింది. మెల్లగా లేవబోయాడు.

అంతవరకు చెప్పిన ప్రశంసలు సరిపోలేదు అల్తాఫ్‌కి. అందుకే "నస్రూ బావ, ఇంత సేపు కవిత్వం విని మీ అభిప్రాయం చెప్పనేలేదు" అన్నాడు. చెప్పక పోతే చస్తావన్నట్లు అతి వినయంగా.

"వర్ణనలు అద్భుతం, శిల్పం అమోఘం. శైలి ద్రాక్షాసారాయిలా మత్తుగా, గమ్మత్తుగా సాగింది. వచ్చిపడ్డ పదబంధాలు, లేత పొట్టేలు మాంసంలా చాలా రుచిగా ఉన్నాయి. ఇక కవిత్వంలోని భావమంటావా? జవానీ లడ్‌కీ స్వప్న్ పే ఆయాతో మన్‌కో కైసా లగ్‌తా. వైసా హై మేరా దిల్" అన్నాడు.

"ఖుదాఫిస్ బావా. ఖుదాఫిస్. ఇన్నాళ్టికి ఈ అల్తాఫ్ కూడా కవిత్వం రాసి, జుబేదా మనసును దోచుకోడానికి అర్హత సంపాదించగలిగాడు" అన్నాడు ఆనందంతో ఉప్పొంగిపోతూ.

వెళ్లబోతూ "ఒక్కమాట" అన్నాడు నస్రూ.

"చెప్పు బావా! ఈ వాక్యాలన్నీ మసీదు గోడలమీద శిలాక్షరాలతో రాసి ఉంచాలంటారా? లేక రాళ్లపై చెక్కించి మన నగరం కూడళ్లలో శాశ్వతంగా పాతించమంటారా?" అన్నాడు వినయంగా.

"తునకలు నీవే. బావున్నాయి. సారాయి నీదే. అది మరీ బాగుంది. కానీ కవిత్వం కూడా నువ్వే రాసుంటే ఈ ప్రశంశలన్నీ నీకే దక్కేవి. ప్రతి పద్యం చివర 'అల్‌ఫిదా' అని కవి పేరు వచ్చింది. అదేదో దేవుని నామం అనుకుని మురిసిపోయావు. అది కవిత్వం రాసినవాడి పేరు. ఈ కవిత్వం తీసుకుపోయి జుబేదాకు వినిపించావనుకో, కాపీ కవిత్వం వినిపిస్తున్నందుకు తన బంగారు చెప్పుతో నీ మూతి పళ్లు రాలగొట్టుద్ది. మడిచి జేబులో పెట్టుకో" అని వెళ్లిపోయాడు.

అల్తాఫ్ ముఖం అమ్మాయి చెంపదెబ్బ తిన్న యువకుడి ముఖంలా మాడిపోయిందని వేరే చెప్పాలా?

- పుప్పాల కృష్ణమూర్తి

ఆలయాల గ్రామం

వావ్! ఎన్ని ఆలయాలు? దంతపు బొమ్మల్లా మెరిసిపోయే పాలరాతి ఆలయాల్లా కనిపిస్తున్నాయే! ఇవి ఒకటా రెండా! ఏకంగా 863 గుళ్లు. గుజరాత్‌లోని ప్రముఖ పట్టణం భావ్‌నగర్‌కు 51 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయాలున్నాయి. వీటిని చూసి తరించాలంటే మాత్రం పాలిటానా గ్రామం వెళ్లాలి. అక్కడ శత్రుంజయ పర్వతంపై ఆ ఆలయాలన్నీ కొలువు తీరాయి. జైనులు ఈ పర్వతాన్ని అతి పవిత్రమైనదిగా భావిస్తారు. అందుకే రాత్రుళ్లు పూజారులతో సహా ఎవ్వరూ ఈ కొండపై వుండరు. ఈ ఆలయాలను 11, 12 శతాబ్దాల్లో సంపన్నులైన జైనులు నిర్మించారని చారిత్రక ఆధారాలు తెల్పుతున్నాయి. 14, 15 శతాబ్దాల్లో జరిగిన దండయాత్రల్లో వీటిలో కొన్ని ధ్వంసమైనా 16వ శతాబ్దంలో చాలా వరకు పునరుద్ధరించారు. ముస్లింలు ఏ విధంగానైతే జీవితంలో ఒక్కసారైనా మక్కామసీదును దర్శించుకోవాలనుకుంటారో, జైనులు ఆ విధంగా ఈ ఆలయాలను తనివితీరా చూడాలనుకుంటారు.